

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY




PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర్ రెడ్డి మంగళవారం 15 మార్చి 2022 సంపుటి: 03 సంచిక: 186 పేజీలు: 4 వెల: రూ 3-00

## అనుచిత ప్రవర్తన.. స్పీకర్‌పై పేపర్లు విసిరిన టీడీపీ సభ్యులు






అమరావతి: అసెంబ్లీలో టీడీపీ ఎమ్మెల్యేలు రచ్చ రచ్చ చేశారు. స్పీకర్ పోడియం వద్ద దారుణంగా ప్రవర్తించారు. స్పీకర్ తమ్మినేని సీతారాం పట్ల టీడీపీ సభ్యులు అనుచితంగా వ్యవహరిస్తూ.. పేపర్లు చించివేసి ఆయనపై విసిరారు. సభ ప్రారంభం నుంచి కూడా టీడీపీ సభ్యులు పదేపదే అడ్డుకునే ప్రయత్నం చేశారు.అసెంబ్లీలో స్పీకర్ పట్ల టీడీపీ అనుచితంగా ప్రవర్తించిందని మంత్రి బొత్స సత్యనారాయణ మండిపడ్డారు. ఆయన మీడియా పాయింట్‌లో మాట్లాడుతూ, వాస్తవాలు ప్రజలకు తెలియకుండా రాద్ధాంతం చేశారని నిప్పులు చెరిగారు. అసెంబ్లీలో ప్రజా సమస్యలపై చర్చకు టీడీపీ ఆటంకం కలిగించిందన్నారు. ప్రభుత్వం చర్చకు సిద్ధమన్నా... స్పీకర్‌పై టీడీపీ సభ్యులు కాగితాలు విసిరారన్నారు. సభలో టీడీపీ సభ్యుల ప్రవర్తను ఖండిస్తున్నామన్నారు. జంగారెడ్డిగూడెంలో మరణాలపై డిప్యూటీ సీఎం వెళ్లి పరిశీలన చేశారన్నారు. జంగారెడ్డిగూడెం మరణాలపై బాధిత కుటుంబం ఎక్కడా ఆందోళన చేయలేదని పేర్కొన్నారు. సభలో వాస్తవాలను స్పష్టంగా ప్రకటన చేస్తామని మంత్రి బొత్స తెలిపారు.

## సహజ మరణాలపై టీడీపీ రాజకీయం: సీఎం జగన్



అమరావతి: సాధారణ మరణాలపై తప్పుడు ప్రచారం జరుగుతోందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. జంగారెడ్డిగూడెం మరణాలపై టీడీపీ చేస్తోన్న అసత్య ప్రచారంపై ఆయన అసెంబ్లీలో స్పందిస్తూ.. నేచురల్ డెత్స్‌పై టీడీపీ రాజకీయం చేస్తోందన్నారు. సహజ మరణాలను కూడా వక్రీకరిస్తున్నారని దుయ్యబట్టారు.కల్తీ మద్యం మరణాలు గతంలోనే అనేక సార్లు జరిగాయి. కల్తీ మద్యాన్ని తమ ప్రభుత్వం ఉక్కుపాదంతో అణిచివేస్తోందని.. రాష్ట్రంలో బెల్ట్ షాపులను సమూలంగా నిర్మూలించామన్నారు. "లాభాపేక్షతో గత ప్రభుత్వం మద్యం అమ్మకాలు జరిపింది. బడి, గుడి సమీపంలో కూడా యథేచ్ఛగా మద్యం అమ్మారు." అని సీఎం ధ్వజమెత్తారు.సహజ మరణాలు దేశవ్యాప్తంగా జరుగుతుంటాయి. దేశంలో ఎక్కడైనా 90 శాతం సహజ మరణాలే ఉంటాయి. అన్ని మరణాలు ఒకే చోట జరిగినవి కాదు. సాధారణ మరణాలపై టీడీపీ తప్పుడు ప్రచారం చేస్తోందని" సీఎం మండిపడ్డారు. తమ హయాంలో 43 వేల బెల్టు షాపులను ఎత్తివేశాం. మద్యపానం నియంత్రించాలన్నదే తమ లక్ష్యమని సీఎం అన్నారు.

### రెండోసారి మండలి ఛైర్మన్ పదవి చేపట్టిన

## గుత్తా సుఖేందర్ రెడ్డి



హైదరాబాద్ : శాసనమండలి ఛైర్మన్‌గా టీఆర్ఎస్ ఎమ్మెల్సీ గుత్తా సుఖేందర్ రెడ్డి రెండోసారి పదవీ బాధ్యతలు స్వీకరించారు. మండలి ఛైర్మన్‌గా సుఖేందర్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికకు ఒకే ఒక్క నామినేషన్ రావడంతో.. గుత్తా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు మండలి అధికారులు ప్రకటించారు. ఈ నేపథ్యంలో గుత్తా సుఖేందర్ రెడ్డిని ఛైర్మన్ సీటు వద్దకు మంత్రులు ప్రశాంత్ రెడ్డి, కేటీఆర్, శ్రీనివాస్ గౌడ్, తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో పాటు పలువురు ఎమ్మెల్సీలు తీసుకెళ్లారు. ఛైర్మన్ సీటులో ఆశీనులైన గుత్తా సుఖేందర్ రెడ్డికి మంత్రులు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.2019, సెప్టెంబర్ 11న తొలిసారిగా గుత్తా సుఖేందర్ రెడ్డి మండలి ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. 2021, జూన్ మొదటి వారం వరకు గుత్తా సుఖేందర్ రెడ్డి మండలి ఛైర్మన్‌గా సేవలందించారు. గుత్తా ఎమ్మెల్సీ పదవీకాలం ముగియడంతో.. ఆయన స్థానంలో ప్రొటెం ఛైర్మన్‌గా ఎమ్మెల్సీ భూపాల్ రెడ్డిని నియమించారు. అనంతరం మండలి ప్రొటెం ఛైర్మన్‌గా ఎమ్మెల్సీ సయ్యద్ అమీనుల్ హసన్ జాఫ్రీ నియామకం అయ్యారు. శాసనమండలికి 2021లో జరిగిన ఎన్నికల్లో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీగా గుత్తా సుఖేందర్ రెడ్డి రెండోసారి నవంబర్ 22న ఎన్నికయ్యారు. ఈ క్రమంలో మళ్లీ ఆయన రెండో సారి మండలి ఛైర్మన్‌గా నేడు బాధ్యతలు స్వీకరించారు.నల్లగొండ జిల్లా ఊరుమడ్ల గ్రామంలో 1954, ఫిబ్రవరి 2న జన్మించిన గుత్తా సుఖేందర్ రెడ్డి.. ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డిగ్రీ పట్టా పొందారు. 1977, మే 1న అరుంధతితో వివాహం జరిగింది. వీరికి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు.గుత్తా సుఖేందర్ రెడ్డి తన రాజకీయ ప్రస్థానాన్ని కమ్యూనిస్టు పార్టీ నుంచి ప్రారంభించారు. కమ్యూనిస్టు పార్టీలో చురుకుగా పని చేసిన ఆయన.. అంచెలంచెలుగా ఎదిగారు. టీడీపీ, కాంగ్రెస్ పార్టీల్లో పని చేశారు. 2004 సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ తరపున నల్లగొండ పార్లమెంట్ స్థానం నుంచి గెలుపొందారు. 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున అదే నియోజకవర్గం నుంచి మళ్లీ ఎంపీగా విజయం సాధించారు. 2014 జనరల్ ఎలక్షన్స్‌లోనూ ఎంపీగా గెలుపొంది.. 2016, జూన్ 15న టీఆర్ఎస్ పార్టీలో చేరారు. 2018లో గుత్తాను సీఎం కేసీఆర్ రైతు సమన్వయ సమితి రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించారు. 2019, ఆగస్టులో ఎమ్మెల్యే కోటాలో తొలిసారిగా మండలికి ఎన్నికయ్యారు. ఈ క్రమంలో రైతు సమన్వయ సమితి అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. 2019, సెప్టెంబర్ 11న మండలి ఛైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నియ్యారు. 2021, జూన్ 3న గుత్తా సుఖేందర్ రెడ్డి పదవీకాలం ముగిసింది. 2021, నవంబర్‌లో జరిగిన ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో మరోసారి గుత్తా సుఖేందర్ రెడ్డి ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. ఈ నేపథ్యంలో రెండోసారి ఆయనను మండలి ఛైర్మన్ పదవి వరించింది.

## తుది ఆదేశాలు ఇవ్వలేము

8 వారాలకు కేసే వాయిదా




విజయవాడ, మార్చి 14, (న్యూస్ పల్స్)తుది ప్రకటన రాలేదు.. మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రకటించింది. కొత్త జిల్లాల ఏర్పాటు విషయంలో దాఖలైన పిటిషన్లపై సోమవారం ఏపీ హైకోర్టు విచారణ చేపట్టింది. జిల్లాల పెంపు అంశంలో రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవోలు ఆర్టికల్ 371(ట)కి విరుద్ధంగా ఉన్నాయంటూ గుంటూరు జిల్లా అప్పాపురం గ్రామానికి చెందిన దొంతినేని విజయ్ కుమార్, శ్రీకాకుళం జిల్లాకు చెందిన బి.సిద్ధార్థ, ప్రకాశం జిల్లా ఒంగోలుకు చెందిన జాగర్లమూడి రామారావు వేర్వేరుగా హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం.. కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. కొత్త జిల్లాలపై తుది ప్రకటన రానందున మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరించింది. అనంతరం తదుపరి విచారణను 8 వారాలకు వాయిదా వేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్ర నేతృత్వంలోని ధర్మాసనం సోమవారం ఈ వ్యాజ్యంపై విచారణ జరిగింది.జిల్లాల పునర్విభజన విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది జనవరి 25న ఇచ్చిన ముసాయిదా నోటిఫికేషన్‌ను చట్టవిరుద్ధమైనదిగా ప్రకటించి. రద్దు చేయాలంటూ హైకోర్టులో పిల్ దాఖలైంది. ముసాయిదా నోటిఫికేషన్, తదనంతరం జారీ చేసిన జీవోలు అధికరణ 371-డికి విరుద్ధమని.. వాటిని రద్దు చేయాలంటూ ఈ వ్యాజ్యాన్ని దాఖలు అయ్యింది. ముసాయిదా జీవోల అమలును నిలుపుదల చేస్తూ మధ్యంతర ఉత్తర్వులివ్వాలని కోరారు. కేంద్ర హోంశాఖ కార్యదర్శి, ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శులను వ్యాజ్యంలో ప్రతివాదులుగా పేర్కొన్నారు

## అసెంబ్లీలో టీడీపీ ఎమ్మెల్యేల ఓవర్ యాక్షన్

టీడీపీ సభ్యుల తీరుపై స్పీకర్ తమ్మినేని ఆగ్రహం



అమరావతి: ఏపీ అసెంబ్లీలో టీడీపీ సభ్యుల తీరుపై స్పీకర్ తమ్మినేని ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఉదయం 9 గంటలకు ఐదోరోజు అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కాగా, టీడీపీ సభ్యులు సభను అడ్డుకుంటూ గందరగోళం సృష్టించారు. స్పీకర్ ఛైర్ వైపు టీడీపీ ఎమ్మెల్యేలు దూసుకెళ్లారు. టీడీపీ సభ్యుల గందరగోళంతో సభను స్పీకర్ తమ్మినేని కాసేపు వాయిదా వేశారు. టీడీపీ సభ్యుల తీరుపై మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ అభ్యంతరం తెలిపారు. సభను అడ్డుకోవడమే ప్రతిపక్షం పనిగా పెట్టుకుందని ఆయన మండిపడ్డారు. సభను సాగనీయకుండా ప్రతిరోజూ అడ్డుపడుతున్నారన్నారు. ప్రతి అంశాన్ని చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని బుగ్గన రాజేంద్రనాథ్ అన్నారు.

## చంద్రబాబు, రామోజీరావుపై మంత్రి కొడాలి నాని ఫైర్.. తప్పుదోవ పట్టిస్తున్నారని ఆగ్రహం

అమరావతి: అసెంబ్లీలో టీడీపీ అధినేత చంద్రబాబుపై పౌర సరఫరాల శాఖ మంత్రి కొడాలి నాని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాడు ఎన్టీఆర్ మద్య నిషేధం అమలు చేస్తే, దానికి తూట్లు పొడిచి చంద్రబాబు తన పాలనలో ఇష్టారాజ్యంగా మద్యం అమ్మకాలు పెంచారని అన్నారు. ఎక్కడ పడితే అక్కడ బెల్ట్‌షాప్‌లు ఏర్పాటు చేయించి, మద్యం అమ్మకాలు పెంచి, అంతులేని అవినీతికి పాల్పడ్డాడని విమర్శించారు.



ఈరోజు కూడా ఎల్లో మీడియా, ఈనాడు జంగారెడ్డిగూడెం ఘటనను తప్పు పట్టిస్తూ, ప్రజల్లో అపోహలు కల్పించే విధంగా కథనం రాసిందని మండిపడ్డారు. రామోజీరావు ఆ స్థాయికి దిగజారాడని ఆరోపించారు. చంద్రబాబు శవ రాజకీయం చేస్తున్నారు. ఏ మాత్రం బాధ్యత లేకుండా వ్యవహరిస్తున్న టీడీపీ సభ్యులను సస్పెండ్ చేయాలన్నారు.

## టీడీపీ హయాంలో 40వేలకు పైగా బెల్ట్‌షాపులు తెరిచారు: ఎమ్మెల్యే రోజా



అమరావతి: చంద్రబాబు అయిదేళ్ల పాలనలో 40 వేలకు పైగా బెల్ట్‌షాపులు తెరిచారని ఎమ్మెల్యే ఆర్‌కే రోజా మండిపడ్డారు. మద్యం సిండికేట్లతో కుమ్మక్కై చంద్రబాబు నాయుడు ఆడవాళ్ల పసుపు కుంకుమలతో, జీవితాలతో చెలగాటమాడారని ధ్వజమెత్తారు. అధికారంలోకి రాకముందు రాష్ట్రంలో బెల్ట్ షాపులు ఎత్తేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారని, తరువాత ఆ హామీని తుంగలో తొక్కారని విమర్శించారు. చంద్రబాబు చేసిన మోసాలను ప్రతి మహిళా గుర్తుపెట్టుకుందన్నారు. అందుకే టీడీపీ ప్రభుత్వాన్ని మహిళలు ఛీ కొట్టి తరిమికొట్టారని మండిపడ్డారు. గత ప్రభుత్వంలో మద్యం పాలసీ ఎలా ఉందని ప్రశ్నించిన రోజా చంద్రబాబు అయిదేళ్లలో 75 వేల కోట్ల మద్యాన్ని ఏరులై పారించారని మండిపడ్డారు. మద్యం బార్ లైసెన్స్‌ల అనుమతి ప్రతి ఏడాది రెన్యూవల్ చేయాలి. అలాంటిది 2017లోనే 2022 వరకు అనుమతులు ఇస్తూ నిర్ణయం తీసుకున్నారని దుయ్యబట్టారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక ఇంటింటికి మినరల్ వాటర్ ఇచ్చారో లేదో కానీ ఇంటింటికి మద్యం బాటిళ్లు అందే పథకం మాత్రం పెట్టారని విమర్శించారు. చంద్రబాబు నాయుడు 2014 నుంచి అయిదు సంవత్సరాల సమయంలో 6 వేల పాఠశాలలను మూసివేశారని గుర్తుచేశారు.

## కల్తీ సారా మరణాలన్నీ ప్రభుత్వ హత్యలే

నారా లోకేష్

విజయవాడ కల్తీ సారా మరణాలన్నీ సీఎం జగన్ రెడ్డి చేసిన హత్యలేనంటూ టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఆధ్వర్యంలో టీడీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నిరసనకు దిగారు. నకిలీ బ్రానీడ్ల బాగోతం వెలికితీయాలంటూ నిరసన ప్రదర్శన నిర్వహించారు. మద్యపాన నిషేధం ఏమైందంటూ ప్లకార్డుల ప్రదర్శన నిర్వహించారు. సచివాలయం అగ్నిమాపక కేంద్రం నుంచి అసెంబ్లీకి నిరసన ర్యాలీ చేపట్టారు. టీడీపీ శాసనసభ పక్షం రాష్ట్రంలో నాసిరకం మద్యం బ్రాండ్లు లభిస్తున్నాయంటూ మద్యం సీసాలతో అసెంబ్లీకి నిరసన ప్రదర్శన నిర్వహించారు

## ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలి

బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు సోమువీర్రాజు

విజయవాడ ధాన్యం కొనుగోలు చేయకుండా ప్రభుత్వం తాత్సారం చేస్తోందని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు సోమువీర్రాజు ఆగ్రహం వ్యక్తంచేశారు. లక్షల టన్నుల ధాన్యం వరికల్లాల్లో ఉండడంతో రైతులు దయనీయ పరిస్థితి ఎదుర్కొంటున్నారు. రెండవ పంట చేతికి వచ్చే పరిస్థితి వస్తున్న తరుణం కూడా ఆసన్నమౌతోంది. ఈసందర్భంలో ప్రభుత్వం స్పష్టమైన విధానం అవలంభించడం లేదని విమర్శించారు. రైతులకు అండగా బిజెపి పోరాటం కొనసాగిస్తుందన్నారు. ఉద్యోగాలకు సంబంధించిన నోటి ఫికేషెన్ విడుదల చేయలేదు. నీటిపారుదల శాఖ లో కీలకమైన లస్కర్ ఉద్యోగాలు దాదాపుగా మూడు వేలు ఖాళీ గా ఉన్నా ఖాళీలు ఎందుకు భర్తీ చేయడం లేదని సోమువీర్రాజు ప్రశ్నించారు.



# సంపాదకీయం

మంగళవారం 15 మార్చి 2022

## కొనఊపిరితో కాంగ్రెస్

దశాబ్దాల పాటు దేశాన్ని ఎదురులేకుండా పాలించిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు చావు బతుకుల మధ్య కొట్టు మిట్టాడుతోంది. నిజానికి చాలా రోజుల నుంచి అది ఐసీయూ లోనే ఉంది. తాజాగా, ఐదు రాష్ట్రాల ఎన్నికలలో ఎదురైన ఘోర పరాభవం దేశంలో ఇక కాంగ్రెస్‌కు చోటు లేదా అనే అనుమానాలకు తావిస్తోంది. ఈ ఫలితాలు 135 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ గ్రాండ్ ఓల్డ్ పార్టీ మనుగడనే ప్రశ్నార్థకం చేశాయి. ప్రస్తుతం కాంగ్రెస్ చేతిలో ఉన్న మూడు రాష్ట్రాలలో పంజాబ్‌ను ఆప్‌కు అప్పగించింది. ఆ రాష్ట్రంలో పూర్తిగా తుడిచి పెట్టుకు పోయింది. కాంగ్రెస్ ఒకసారి ఓడిన చోట తిరిగి గెలవటం చాలా కష్టం. ఢిల్లీ, తెలంగాణ,ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, మధ్యప్రదేశ్ వంటి అనేక ఉదాహరణలు ఉన్నాయి. ఇప్పుడు పంజాబ్ కూడా ఆ జాబితాలో చేరింది. ఢిల్లీని మరిచిపోయినట్టే పంజాబ్‌ను కూడా కాంగ్రెస్ మర్చిపోవాల్సిందే2014 నుంచి ఒకటీ అరా తప్పిస్తే కాంగ్రెస్‌కు అన్నీ ఘోర పరాభవాలే. ఆ ఎన్నికలలో కాంగ్రెస్ చరిత్రలోనే అత్యల్పంగా 44 లోక్‌సభ స్థానాలకు పడిపోయింది. చాలా మంది తమ జీవితకాలంలో హస్తం పార్టీని ఈ స్థితిలో చూస్తామని అనుకుని ఉండరు. సీట్లు మాత్రమే కాదు ఓటు షేర్ కూడా ఈ ఎనిమిదేళ్లలో 29 శాతం నుంచి 19 శాతానికి పడిపోయింది. ఏటేటా పడిపోవటమే తప్ప నిలబడింది లేదు. పరిస్థితి చూస్తుంటే ప్రధాని మోడీ పదే పదే చెప్పే కాంగ్రెస్ ముక్త్ భారత్ నిజమయ్యేలా ఉంది.2019 లోక్‌సభ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పరిస్థితి ఏమాత్రం మెరుగుపడ లేదు. ఈ మారు 52 సీట్లు మించలేదు. బీజేపీతో ముఖా ముఖి ఢీకొన్న స్థానాల్లో దాని విజయ శాతం పది లోపే. ప్రాంతీయ పార్టీలతో పోలిస్తే కాంగ్రెస్‌ను బీజేపీ సునాయాసంగా ఓడించగలుగుతోంది. ఒకప్పుడు కాంగ్రెస్‌కు పెట్టని కోటలా ఉన్న ఈశాన్య రాష్ట్రాలు నేడు పూర్తిగా బీజేపీ వశమయ్యాయి. దేశంలోనే అతి పెద్ద రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్‌లో కాంగ్రెస్ మళ్లీ లేవటం అటుంచి..పూర్తిగా కనుమరుగు కాకపోతే చాలు. ప్రియాంకా గాంధీ కాలికి బలపం కట్టుకుని రాష్ట్రమంతా తిరిగినా రెండు సీట్లకు మించి రాలేదు. ఓటు షేర్ నిండా మూడు శాతం కూడా లేదు. గాంధీలకు పెట్టిని కోటలైన అమేథీ, రాయ్‌బరేలీలో కూడా ఇప్పుడు కాంగ్రెస్ ప్రధాన ప్రత్యర్థి కాలేకపోవటం దానిని దుస్థితికి నిదర్శనం. ఇన్నాళ్లూ ఆ పార్టీ క్యాడర్‌కు ప్రియాంక కరిశ్మా మీద కొంత నమ్మకం ఉండేది. ఆమెను తమ తురుపు ముక్కగా బావించే వారు. కానీ ఈ దెబ్బతో ఆమె మీద పెట్టుకున్న ఆశలు కూడా ఆవిరయ్యాయి.కాంగ్రెస్‌కు ఈ దుస్థితి ఎవరో వల్లనో వచ్చింది కాదు. అంతా దాని స్వయంకృతాపరాధమే. యూపీఏ పదేళ్ల పాలనలో ప్రధాని మన్మోహన్ సింగ్ అయినా ప్రభుత్వ పగ్గాలు మాత్రం తల్లీ కొడుకుల చేతిలోనే ఉన్నాయి. కాంగ్రెస్ పార్టీ పబ్లిక్ లిమిటెడ్ కంపెనీగా మారిందనే విమర్శలు వచ్చాయి. ఇక యూపీఏ టూలో వెలుగు చూసిన అనేక భారీ కుంభకోణాలు కాంగ్రెస్ ప్రతిష్టను తీవ్రంగా దెబ్బతీయటమే కాదు బీజేపీకి బలమైన అస్త్రాలుగా మారాయి. మరోవైపు కొంత కాలంగా పార్టీని నాయకత్వ సమస్య వేధిస్తోంది. అధ్యక్ష పగ్గాలు చేపట్టిన రాహుల్ గాంధీ 2019 ఓటమితో ఆ పదవి నుంచి తప్పుకున్నారు. సోనియా గాంధీ ఆరోగ్యం సహకరించకపోయినా పార్టీ పగ్గాలు తిరిగి ఆమె చేతికే వెళ్లాయి. ఇదే సమయంలో పార్టీలో సీనియర్ నేతలు ధిక్కార స్వరం వినిపిస్తున్నారు. రాహుల్ వ్యవహారశైలి కూడా వారికి ఏమాత్రం నచ్చటం లేదు. తాజా పరాభవాలతో వారు మళ్లీ అధిష్టానాన్ని ఇరుకున పెట్టవచ్చు.కాంగ్రెస్ పార్టీ ఇంకా పడిపోకుండా తిరిగి నిలబడాలంటే ముందు అది గాంధీ ఇమేజ్ నుంచి బయటపడాలి. గాంధీ పేరుతో ఇక ఏ మాత్రం ఓట్లు రాలవని తేలిపోయింది. కనుకనే కేజ్రీవాల్, మమతా బెనర్జీ వంటి నాయకులు కాంగ్రెస్ స్థానాన్ని ఆక్రమించే ప్రయత్నంలో ఉన్నారు. ఆ ప్రయత్నాల్లో విజయవంతం అవుతున్నారనటానికి పంజాబ్ ఒక ఉదాహరణ. వచ్చే రోజుల్లో గుజరాత్, హర్యానా, ఉత్తరాఖండ్ వంటి రాష్ట్రాల్లో ఇది పునారవృతం కావచ్చు. దీనిని కాంగ్రెస్ ఇప్పటికైనా గుర్తించాలి. బీజేపీ రాత్రికి రాత్రి ఈ స్థాయికి చేరలేదు. దాని ఎదుగుదల వెనక ఎన్నో వ్యూహాలు, ఎంతోమంది నిరంతర శ్రమ ఉంది. నరేంద్ర మోడీ, యోగి ఆదిత్యనాథ్ వంటి ప్రజాకర్షణ కలిగిన నేతలు కాంగ్రెస్‌లో లేరు. ఇందిర, రాజీవ్ తర్వాత అలాంటి నేతలు లేరు. రాహుల్ గాంధీకి అవకాశం ఉన్నా ఆయన రాజకీయాలను ఇప్పటికీ సీరియస్ గా తీకుంటున్నట్టు అనిపించదు. ఎన్నికల ముందు హడావుడి, సందర్భానుసారం ట్విట్టర్ ప్రటనలు మినహా ఇస్తే ఆయన ప్రజాల్లోకి దూసుకుపోవటం లేదు. ఈ విషయంలో ఆయన కన్నా ప్రియాంక గాంధీ ముందున్నారు. కానీ ఆమె కాంగ్రెస్ పార్టీ పూర్తిగా దెబ్బతిన్న తరువాత ఎంట్రీ ఇచ్చారు..అదేదే కొన్నేళ్ల ముందు చేసి ఉంటే ఇప్పుడు ఆమె పార్టీలో గొప్ప ప్రజాకర్షక నేతగా ఎదిగే వారు. కనీసం యూపీఏ 2 లో కొంత కాలం రాహుల్‌ను ప్రధానిని చేసినా ఆయన పొలిటికల్ స్టేచర్ పెరిగి ఉండేది. ఇప్పటికీ పార్టీలో రాహుల్ పాత్ర ఫలానా అని చెప్పలేని పరిస్థితి. కాంగ్రెస్ బీజేపీ ముఖాముఖి తలపడే హిందీ బెల్ట్‌లో హస్తం పార్టీ బలోపేతం కాకపోతే ఆప్ వంటి ఇతర పార్టీలు అక్కడ కూడా తిష్ట వేయటం ఖాయం. ఎందుకంటే కాంగ్రెస్‌ను పట్టుకుని ఎవరూ ఎక్కువ కాలం ఉండరు. రాజకీయ శూన్యత ఏర్పడినపుడు ఎవరో ఒకరు దానిని పూర్తి చేస్తారు. కొత్త వారికి అవకాశం ఇస్తుంది. పంజాబ్‌లో అదే జరిగింది. రేపు గుజరాత్‌లో అదే జరుగుతుంది. ఇక వ్యూహ రచనలు ఆమలు చేయటంలో కూడా కాంగ్రెస్ ఘోరంగా విఫలమవుతోంది. ఇప్పటి వరకు రాహుల్ గాంధీ అనుసరించిన ఏ వ్యూహమూ ఫలితం ఇవ్వలేదు.కాంగ్రెస్ ముందు ఇప్పుడు మిగిలింది ఒకే ఒక్క మార్గం. పార్టీని మూలల నుంచి నుంచి బలోపేతం చేయాలి. మరో ఐదేళ్లు అధికారం గురించి మర్చిపోయి కొత్త తరం నాయకత్వాన్ని సృష్టించిటంపై దృష్టి కేంద్రీకరించాలి. బూత్ స్థాయి నుంచి పార్టీని తిరిగి సన్నద్ధం చేయాల్సిన అవసరం ఉంది. అప్పుడే బీజేపీని ఎదుర్కోవటం కాంగ్రెస్ సాధ్యం. లేని పక్షంలో కాంగ్రెస్ కూడా వామపక్షాల సరసన చేరుతుంది. నిజానికి కాంగ్రెస్‌లా వామపక్షాలు ఢిల్లీ పీఠం ఎక్కలేదు. కానీ తమ సైద్ధాంతిక నిబద్ధత, హక్కుల పోరాటాలతో ఇప్పటికీ ప్రజల మధ్య ఆ పార్టీ సజీవంగా ఉంది. చట్ట సభల్లో బలం లేకపోవచ్చు కాని ప్రజాక్షేత్రంలో వామపక్షాల ప్రాధాన్యత ఇప్పటికీ తగ్గలేదు.మరోవైపు, కాంగ్రెస్ కేంద్రంలో ప్రతిపక్షంలో కూర్చుంది ఇప్పటి వరకు కేవలం పదిహేనేళ్లే. యాభై ఏళ్ల పాటు అధికారం చెలాయించింది. కేవలం ఎనిమిదేళ్లు అధికారం లేకపోతే దాని పరిస్థితి ఇంతలా దిగజారుతుందా..ఇది నిజంగా ఆశ్చర్యమే.

## పదవీ కోసం ఆశావహులు ప్రయత్నాలు

విజయవాడ, మార్చి 14, ఇంతవరకు, ఎందరో ఆశావహులు, వేయి కళ్ళతో, ముక్కోటి ఆశలతో ఎదురు చూస్తున్న సుముహూర్తం వచ్చేస్తోంది. అవును, ఎంతో కాలంగా ఊహగానాలకే పరిమితం అయిన ఆంధ్ర ప్రదేశ్ మంత్రివర్గ పునర్ వ్యవస్థీకరణ త్వరలోనే ఉంటుందని స్వయంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నుంచే స్పష్టమైన సకేతాలు వచ్చేశాయి. పునర్ వ్యవస్థీకరణ విషయంలో ఇంతవరకు వాళ్ళూ వీళ్ళూ మాట్లాడడమే కానీ, ముఖ్యమంత్రి నోటి నుంచి మాత్రం అలాంటి మాట ఎప్పుడూ రాలేదు. కానీ, ఈరోజు జరిగిన మంత్రి వర్గ సమావేశంలో, స్వయంగా ముఖ్యమంత్రి జగన్ రెడ్డి పునర్ వ్యవస్థీకరణపై మౌనం వీడడమే కాదు, అందుకు సంబదించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మంత్రి పదవులకోసం చాలా మంది పోటీలో ఉన్నారని చెప్పారు. మంత్రివర్గంలో స్థానం లేనంత మాత్రాన వారిని పక్కన పెట్టినట్లు కాదన్నారు. మళ్లీ గెలిచి వస్తే మంత్రులుగా ఉండేది మీరే అంటూ ముదస్తు బిస్కట్' కూడా వేశారు. అంతే కాదు.. మంత్రివర్గంలో లేనివాళ్లు పార్టీ కోసం పనిచేయాలని చెప్పారు.అంటే ప్రస్తుత మంత్రుల్లో కొదరు త్వరలో మాజీలు కాబోతున్నారని ముఖ్యమంత్రి చెప్పకనే చెప్పారు. అయితే ముఖ్యమంత్రి ఎంత మందికి ఉద్వాసన పలుకుతున్నారు, ఎవరెవరికి ఉద్వాసన పలుకుతున్నారు అనేది మాత్రం స్పష్టం కాలేదు. గత కొంత కాలంగా త్వరలో మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ ఉండొచ్చనే ఊహాగానాల నేపథ్యంలో ముఖ్యమంత్రి జగన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. త్వరలో వైకాపా శాసనసభాపక్ష సమావేశం జరగనుంది. ఆ సమావేశంలో స్పష్టత వచ్చే అవకాశం ఉందని అంటున్నారుఅదలా ఉంటే ,గత కొద్దిరోజులుగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి త్వరలోనే తమ మంత్రి వర్గాన్ని పునర్వ్యవస్థీకరిస్తారానే ప్రచారం అటు పార్టీ వర్గాల్లో, ఇటు మిడియా వర్గాల్లో వినవస్తోంది. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ముగిసిన వెంటనే, ముఖ్యమంత్రి మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ పై దృష్టి పెడతారని పార్టీలో ప్రచారం జరుగుతోంది. ఊగాదికి కొత్త జిల్లాలతోపాటుగా, కొత్త మంత్రి వర్గం కొలువు తీరడం ఖాయమని,అంటున్నారు. నిజానికి, ముఖ్యమంత్రి రెండున్నర సంవత్సరాలు పూర్తయిన వెంటనే, పాత ముఖాలను పూర్తిగా పక్కన పెట్టి, కొత్తవారికి అవకాశం కల్పిస్తామని చెప్పారు, అయితే, తొలి రెండున్నర సంవత్సరాలలో ఎక్కువ కాలం, 'కొవిడ్' మింగేయడంతో మంత్రి వర్గ పునర్వ్యవస్థీకరణను మరో ఆరు నెలలు వాయిదా వేశారు. ఇప్పుడు ఆ గడవు కూడా ముగియడంతో ముఖ్యమంత్రి ముహూర్తం ఖరారు చేశారని పార్టీ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. అయితే, ముందు చెప్పినట్లుగా మంత్రివర్గాన్ని పూర్తిగా మార్చేసి ఆలోచన అయితే, ఇప్పుడు లేదని అంటున్నారు. ముందస్తు ఎన్నికల ఆలోచన కూడా ఉన్న నేపథ్యంలో మేకపాటి మరణంతో ఏర్పడిన ఖాళీని భర్తీ చేయడంతో పాటుగా స్వల్పమార్పులు చేర్పులతో మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ పూర్తిచేస్తారని అంటున్నారు. ఈరోజు ముఖ్యమంత్రి ఇచ్చిన హింట్'ను బట్టి చూసినా, స్వల్పమార్పులతో సరిపెట్టే ఆలోచనలోనే ఆయన ఉన్నట్లు అర్థమవుతోంది.అదలా ఉంటే, ఇప్పటికే నగరి ఎమ్మెల్యే ఆర్కే రోజా, ఈసారి ఎలాగైనా మంత్రి పదవి దక్కించుకోవాలని చాలా గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. ఒక్క ఛాన్స్ ప్లేజ్' అంటూ ఆమె ముఖ్యమంత్రిని ప్రసన్నం చేసుకునేందుకు చేస్తున్న ప్రయత్నాలు అ అంతటా కనిపిస్తూనే ఉన్నాయి. సరే, రోజాకు మంత్రి పదవి వస్తుందా రాదా అనే విషయాన్ని పక్కన పెడితే, ఆదే స్థాయిలో మరో మహిళా ఎమ్మెల్యే, చిలుకలూరిపేట ఎమ్మెల్యే విడదల రజనీ కూడా మంత్రి పదవి కోసం తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నారని సమాచారం.

## రోజా..కిం కర్తవ్యం...



తిరుపతి, మార్చి 14, వెండితెర మీద హీరోయిన్‌గా నటించినంత కాలం.. వెలుగులే వెలుగులు. బుల్లి తెర మీద జడ్జిగా ఉన్నా.. అన్నీ మెరుపులే మెరుపులు. కానీ అదేం విచిత్రమో.... రాజకీయ జీవితంలో అడుగు పెట్టిన తర్వాత అన్నీ మరకలే మరకలు. ఇది నగరి ఎమ్మెల్యే ఆర్కే రోజా స్వగతం. 2014 ఎన్నికల్లో గెలిచి అసెంబ్లీలో అడుగు పెట్టినా... నాటి విపక్ష ఎమ్మెల్యేగా ఉన్నా.. అధికార టీడీపీ వల్ల ఎన్నో అవమానాలు, మరెన్నో ఇబ్బందులు. ఫ్యాన్ పార్టీ అధికారంలోకి వస్తే.. తనకు మంచి రోజులు వస్తాయని భావించిందీ ఈ ఆర్కే రోజా. కానీ ఫ్యాన్ పార్టీ అధికార పక్షంలోకి వచ్చినా.. అ స్వపక్షంలో తనకు విపక్షం తయారైందనీ ఈ రోజా తెగ ఫీలైపోతుందనే టాక్ అయితే నగరి నియోజకవర్గంలో రచ్చ రచ్చగా నడుస్తోంది. వైయస్ జగన్ కేబినెట్‌లో మంత్రి గిరి కొట్టేద్దామనుకుంది. కానీ సీఎం జగన్ వద్ద మరీ అలక బూనీ మంగళగిరిలోని ఏపీఐఐసీ ఛైర్మన్ పదవిని పట్టుకోంది. మరోవైపు ఎమ్మెల్యే రోజాను రాజకీయంగా దెబ్బ కొట్టేందుకు ఆమె జిల్లాకు చెందిన సీనియర్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రరెడ్డి వచ్చిన ఏ అవకాశాన్ని వదులు కోవడం లేదు. అంతేకాదు.. రోజాను దెబ్బ తీయడానికి అవకాశాల కోసం ఆయన మరీ వేచి చూస్తున్నారనే టాక్ కూడా శ్రీవారి కొలువైన జిల్లాలో జోరుగా సాగుతోంది. ఇప్పటికే నగరి నియోజకవర్గంలోని అయిదు మండలాల్లో ఫ్యాన్ పార్టీ లీడర్ నుంచి కేడర్ వరకు అంతా ఓ వర్గంగా చేరి.. రోజాకు వ్యతిరేకంగా గుడూపుఠాణి నడుపుతున్నారన్న సంగతి ప్రతి ఒక్కరికీ తెలిసిందే. రానున్న ఎన్నికల్లో ఆమె ఓటమి కోసం.. ఇప్పటికే వారు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. అందుకోసం వారికి పెద్దిరెడ్డి ధన, కనక వస్తు రూపేణా సహాయ సహకరాలు అందిస్తున్నారన్న విషయం బహిరంగ రహస్యమే. దీంతో తన ఓటు బ్యాంక్ గల్లంతవుతోందని రోజా ముందే ఊహించింది. నగరిలో తమిళ ఓటర్లు అత్యధికంగా ఉన్నారు. వారి ఓట్లను కొల్లగొట్టేందుకు... ఇటీవల తన భర్త సెల్వమణితో కలసి ఆమె తమిళనాడు సీఎం స్టాలిన్‌తో భేటీ అయి.. తన నియోజకవర్గంలోని తమిళులకు సహాయ సహకారాలు అందించాలంటూ కొత్త పల్లవి అందుకోందీ రోజా. ఈ విషయాన్ని పరిశీలిస్తానంటూ స్టాలిన్ చెప్పడంతో.. ఆమె కాస్తా డీలా పడినట్లు తెలుస్తోంది. ఇదే అంశాన్ని సీఎం జగన్‌కు కూడా వివరించగా.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి నీకు తెలియనిది కాదంటూ ముక్తాయింపు నిచ్చీ మరీ రోజాకు క్లాస్ పీకినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఈ సారి ఎన్నికల్లో గెలుపు అంత ఈజీ కాదని.. దాంతో తీవ్ర ఆలోచనలతో రోజా నలిగిపోతున్నట్లు ఆమె సన్నిహితులు పేర్కొంటున్నారు. మరోవైపు.. మంత్రి పదవి వస్తే.. తన రాజకీయ ప్రత్యర్థి, మంత్రి పెద్దిరెడ్డిపై ఓ రేంజ్‌లో హల్‌చల్ చేయవచ్చుననే ఆలోచనలో ఉందీ రోజా. కానీ ఆమె ఆశలు ఆడియాశలు అయ్యేలా ఉన్నాయని తాడేపల్లి ప్యాలెస్‌లో టాక్ వైరల్ అవుతోంది. రోజా హవా అంతా గత కాల జ్ఞాపకంగా మారిందనే టాక్ కూడా నడుస్తోంది. నేడు అంతా చిలకలూరిపేట ఎమ్మెల్మే రజినీదే హవా అని... ప్రస్తుతం జగన్ కేబినెట్‌లో ముగ్గురు మహిళా మంత్రులు ఉన్నా.. వారు హోం మంత్ర, డిప్యూటీ సీఎంగా ఉన్నా.. వారంతా విడదల రజనీ ముందు దిగదుడుపే అనే టాక్ అయితే అమరావతిలో సైతం హల్ చల్ చేస్తోంది. రానున్న ఉగాదికి జగన్ కొత్త కేబినెట్ కొలువు తీరనుందని సమాచారం. ఈ కేబినెట్‌లో రజనీకి బర్త్ కన్‌ఫార్మ్ అయినట్లు తెలుస్తోంది. కానీ రోజా విషయంలో అలా కాదు.. చిత్తూరు జిల్లా రెండు జిల్లాలు అవుతున్న సందర్భంగా ఆమెకు కాకుండా కేబినెట్ బర్త్.. భూమన లేదా చెవిరెడ్డి తన్నుకు పోయే అవకాశం ఉందని సమాచారం. మరోవైపు రానున్న ఎన్నికల్లో ఆమె గెలుపు నల్లేరు మీద నడక కాదని.. ఆమెకు కూడా తెలుసు. దీంతో రోజా రాజకీయానికి చెక్ పెట్టేందుకు పెద్దిరెడ్డి మంత్రాంగం వంద శాతం వర్క్ అవుట్ అవుతుందని చిత్తూరు జిల్లాలో జోరుగా నడుస్తోంది.

## బడ్జెట్ లో కేటాయింపులు ఎక్కడ..

విజయవాడ, మార్చి 14, ఆంధ్ర పదేశ్ ప్రభుత్వం రాజధాని విషయంలో, అదే 'పెడ'ధోరణి కొనసాగిస్తోందా? అంటే, అవుననే అనవలసి వస్తోంది. నిజానికి, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మానస పుత్రిక మూడు రాజధానుల విషయంలో, రాష్ట్ర హై కోర్టు, గట్టిగానే మొట్టికాయలు వేసింది. 'మూడు' మార్చుకోమని చెప్పింది. మూడు రాజధానుల చట్టం చేసే అధికారమే, ప్రభుత్వానికి /అసెంబ్లీకి లేదని తేల్చి చెప్పింది. అమరావతి ఒక్కటే రాష్ట్ర రాజధానని, ఇంకో మాట లేదని స్పష్టం చేసింది. అయినా, ప్రభుత్వం వైఖరిలో మార్పులేదు. నిజానికి కోర్టు తీర్పు వెలువడిన తర్వాత కూడా మంత్రులు, అధికార పార్టీ నాయకులు, ప్రభుత్వ వైఖరిలో మార్లు లేదని చెపుతూనే వచ్చారు.ఇప్పుడు, ప్రభుత్వం అదే పేద ధోరణి చేతల్లోనూ చూపించింది. కోర్టు ఆదేశాల ప్రకారం అమరావతి అభివృద్ధికి బడ్జెట్‌లో ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు. కేవలం కౌలు, పేదలకు పింఛను, బ్యాంకులకు వడ్డీ చెల్లింపులకు మాత్రమే నిధులు కేటాయించింది. అదేమంటే.. కేంద్రం నుంచి రూ. 8వందల కోట్లు వస్తాయంటూ పద్దుల్లో చూపించింది.బడ్జెట్'లో రాజధానికి చేసిన కేటాయింపులు గమనిస్తే, జగన్ రెడ్డి ప్రభుత్వం హైకోర్టు ఆదేశాలను, బేఖాతరు చేయాలనే నిర్ణయానికి వచ్చినట్లే ఉందని, పరిశీలకులు అంటున్నారు. రాష్ట్ర హై కోర్టు ధర్మాసనం ఇచ్చిన తీర్పులోని ఆదేశాల అమలు చేసేందుకు న్యాయస్థానం ప్రభుత్వానికి నిర్దిష్ట గడువులు విధించింది. రాజధానిలో నెల రోజుల్లో మౌలిక వసతుల నిర్మాణం పూర్తి చేయాలని, 3 నెలల్లో రైతులకు లేఅవుట్‌లు అభివృద్ధి చేసి స్థలాలు అప్పగించాలని హైకోర్టు తీర్పులో స్పష్టం చేసింది. మాస్టర్‌ప్లాన్‌ను అనుసరించి 6 నెలల్లో రాజధాని నిర్మాణం పూర్తి చేయాలనీ ప్రభుత్వానికి విస్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. అయినా, ప్రభుత్వం అందుకు అవసరమైన నిధులను బడ్జెట్' లో కేటాయించలేదు. నిజానికి, జగన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వస్తూనే ముందుగా అమరావతి పనులు నిలిపివేసింది. ఆ తర్వాత కోర్టు కేసులను కారణంగా చూపి, అమరావతి అభివృద్ధిని అటకెక్కించింది. గడచిన రెండున్నర పైచిలుకు కాలంలో, అమరావతిలో తట్ట మట్టి ఎత్తింది లేదు, ఒక రూపాయి ఖర్చు చేసింది లేదు. అయినా, అమరావతి భూములను, గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన భవనాలను తాకట్టు పెట్టి రుణాలు తెచ్చుకునేందుకు ప్రయత్నం చేసింది. ఆ సందర్భంగా కొద్ది పాటి పనులు చేపట్టిన ప్రభుత్వ ఉద్దేశం అమరావతి అభివృద్ధి కాదు, అనేది అందరికీ తెలిసిన రహస్యమే. ఇప్పుడు కోర్టు తీర్పు వచ్చిన తర్వాత అయినా ప్రభుత్వం వైఖరి మారుతుందని అనుకుంటే, అదీ లేదు. అమరావతిలో మౌలిక వసతుల అభివృద్ధికి 2022-23 వార్షిక బడ్జెట్‌లో ఒక్క రూపాయి కూడా కేటాయించకపోవడమే దీనికి నిదర్శనం. బడ్జెట్ అంకెల్లో మాత్రం 1329.21 కోట్లు కేటాయించినట్టుగా చూపించి కనికట్టు చేసింది. అందులో రూ. 800 కోట్లు కేంద్ర ప్రభుత్వం నుంచి సాయంగా వస్తుందని, గాలిలో దేపం వెలిగించింది.బడ్జెట్ కేటాయింపులను పట్టి చూస్తే ముఖ్యమంత్రి జగన్ రెడ్డి ప్రభుత్వానికి అమరావతి అభివృద్ధి చేసే ఆలోచన లేదనే విషయం మరో మారు స్పష్ట మైంది. అయితే, హై కోర్టు ధర్మాసనం ఎప్పటి కప్పుడు ప్రగతి నివేదిక ఇవ్వాలని ఆదేశించిన నేపథ్యంలో, ప్రభుత్వ కోర్టు ఆదేశాలను ఉల్లంఘిస్తుందా? ఉల్లంఘిస్తే న్యాయస్థానం ఎలా స్పందిస్తుంది అనేది చూడవలసి వుందని పరిశీలకులు అంటున్నారు.

## నలుగురు ఎర్ర చందనం స్మగ్లర్లు అరెస్టు

కడప కడప జిల్లా చింతకొమ్మ దిన్నె పోలీస్ స్టేషన్ పరిధిలోని చెర్లోపల్లి హౌసింగ్ ప్లాట్ల సమీపంలో ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడుతున్న నలుగురు అంతర్ రాష్ట్ర ఎర్రచందనం స్మగ్లర్లు అరెస్ట్ అయ్యారు. పట్టుబడ్డ స్మగ్లర్లు గతంలో పలు ఎర్రచందనం స్మగ్లింగ్ కేసుల్లో నిందితులుగా వున్నట్లు గుర్తించారు. అంతర్రాష్ట్ర స్మగ్లర్ ల వద్ద నుంచి 34 ఎర్రచందనం దుంగలు, 2 కార్లు, 3 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు సమాచారం జిల్లా ఎస్పీ కె.కె.ఎన్ అన్బురాజన్ ఐ.పి.ఎస్ వివరించారు. ఎస్పీ మాట్లాడుతూ ఎర్రచందనం అక్రమ రవాణా కు పాల్పడితే పి.డి యాక్ట్ ప్రయోగిస్తామని అన్నారు. . ఎర్ర చందనం స్మగ్లర్లను అరెస్టు చేసి దుంగలను స్వాధీనం చేసుకోవడంలో కీలక పాత్ర పోషించిన కడప డీఎస్పీ వెంకట శివారెడ్డి ఆధ్వర్యంలో రెడ్ శాండర్స్ యాంటీ స్మగ్లింగ్ సెల్ ఇన్స్పెక్టర్ బి.నాగార్జున, చింతకొమ్మదిన్నె ఎస్సై మంజునాథ్ రెడ్డి, సిబ్బంది ని అభినందించి రివార్డులు అందచేసారు.

## నెల్లూరులో ఎవరికి బెర్త్.....

నెల్లూరు, మార్చి 14, (న్యూస్ పల్స్)ఆంధ్రప్రదేశ్ లో మంత్రి వర్గ విస్తరణ ఖాయమయింది. ముహూర్తం ఎప్పుడు అన్నదే తేలాల్సి ఉంది. అయితే సీనియర్ నేతలు అనేక మంది మంత్రి పదవుల కోసం ఎదురు చూస్తున్నారు. అందులో నెల్లూరు జిల్లాకు చెందిన ఆనం రామనారాయణరెడ్డి మంత్రి పదవి పై ఆశలు పెట్టుకున్నారు. మంత్రిగా ఉన్న మేకపాటి గౌతమ్ రెడ్డి మరణంతో ఆయనలో కొంత ఆశలు పెరిగాయి. రెడ్డి సామాజికవర్గం కోటాలో తనకు మంత్రి పదవి దక్కుతుందని ఆశిస్తున్నారు. 2019 ఎన్నికలకు ముందు ఆనం రామనారాయణరెడ్డి టీడీపీ నుంచి వైసీపీలో చేరారు. నెల్లూరు జిల్లా రాజకీయాల్లో ఆనం కుటుంబానికి ఒక ప్రత్యేకత ఉంది. సుదీర్ఘకాలం ఆనం కుటుంబం రాజకీయాల్లో అనేక పదవులు పొందుతూ వస్తుంది. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు మంత్రిగా పనిచేశారు. అయితే జగన్ కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చి వైసీపీని స్థాపించినప్పుడు ఆనం కుటుంబం కాంగ్రెస్ లోనే ఉంది. రాష్ట్ర విభజన తర్వాత టీడీపీలో చేరింది నెల్లూరులో అనేక మంది మంత్రి పదవుల కోసం ఆశిస్తున్నారు. వైసీపీ ఆవిర్భావం తర్వాత తొలిసారి వచ్చిన కోవూరు ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి మంత్రి పదవి పై గట్ట ?ఆశలు పెట్టుకున్నారు. అలాగే జిల్లా పార్టీ అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్ రెడ్డి సయితం మంత్రి పదవి తనకే దక్కుతుందని గట్టి నమ్మకంతో ఉన్నారు. ఇది ఎన్నికల టీం కావడంతో జిల్లా నేతలను సమన్వయం చేసుకునే నేతను మంత్రిగా నియమించాలని జగన్ భావిస్తున్నారు ఆనం కుటుంబంతో నెల్లూరు జిల్లా నేతలకు పొసగదు. ఆయన రాజకీయం అంతా వన్ సైడ్ ఉంటుందన్నది వైసీపీ ఎమ్మెల్యేలే అంతర్గత సంభాషణల్లో ఆరోపిస్తున్నారు. మంత్రి అనిల్ కుమార్ యాదవ్, కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ఆనంకు వ్యతిరేకంగా ఉన్నారు. వీఆర్ కళాశాల వ్యవహారంలో వీరి మధ్య విభేదాలు చోటు చేసుకున్నాయి. నెల్లూరు జిల్లాలో పది నియోజవర్గాలుండగా అందులో ఏడింటిలో రెడ్డి సామాజికవర్గం నేతలే ఎమ్మెల్యేలుగా ఉన్నారు. వీరిలో సింహభాగం ఆనంను వ్యతిరేకిస్తున్నారు. దీంతో ఆనం రామనారాయణరెడ్డికి ఈసారి కూడా మంత్రి పదవి దక్కే ఛాన్స్ లేదంటున్నారు.

## 19న బీజేపీలో డీఎల్

కడప, మార్చి 14, సీనియర్ నేత డీఎల్ రవీంద్రారెడ్డి పార్టీ మారేందుకు సిద్ధంగా ఉన్నారు. ఆయన ప్రస్తుతం వైసీపీలో అసంతృప్త నేతగా ఉన్నారు. జగన్ ప్రభుత్వంపై సీరియస్ కామెంట్స్ చేస్తున్నారు. డీఎల్ గత ఎన్నికలకు ముందు వైసీపీకి మద్దతుదారుగా ఉన్నారు. ఆయన జగన్ ను కలిశారు తప్ప పార్టీ కండువాను కప్పుకోలేదంటారు. అయితే అధికారంలోకి వస్తే ఏదో ఒక పదవి దక్కుతుందని డీఎల్ రవీంద్రారెడ్డి ఆశించారు. ఎమ్మెల్సీ పదవిని ఆయన కోరుకున్నారు.కానీ జగన్ కడప జిల్లాలో ప్రొద్దుటూరుకు చెందిన రమేష్ యాదవ్, బద్వేలుకు చెందిన డీసీ గోవిందరెడ్డికి ఇచ్చారు. దీంతో డీఎల్ రవీంద్రారెడ్డి ఆశలు గల్లంతయ్యాయి. అందుకే ఆయన గత కొంత కాలంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్నారు. అయితే ఆయన టీడీపీలోకి వెళ్లాలని కొంత ఆలోచన చేశారు. వచ్చే ఎన్నికల్లో మైదుకూరు టిక్కెట్ తనకు ఇస్తే పార్టీలోకి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నానని డీఎల్ రవీంద్రారెడ్డి టీడీపీ అధినాయకత్వానికి సంకేతాలు పంపారు. అక్కడ పార్టీకి పుట్టా సుధాకర్ యాదవ్ కొన్నేళ్లుగా పనిచేస్తున్నారు. బీజేపీలో చేరాలని.... దీంతో టీడీపీ అధినాయకత్వం నుంచి ఎలాంటి స్పందన లేదు. దీంతో వచ్చే ఎన్నికల్లో ఎలాగైనా పోటీ చేయాలని డీఎల్ రవీంద్రారెడ్డి భావిస్తున్నారు. టీడీపీ, వైసీపీలకు ప్రత్యామ్నాయంగా ఆయన బీజేపీని ఎంచుకున్నట్లు తెలిసింది. ప్రస్తుతం బీజేపీ దేశంలో నెంబర్ వన్ గా ఉంది. ఏపీలో దాని ప్రభావం పెద్దగా లేకపోయినా తన వ్యక్తిగత ఇమేజ్, జనసేన పొత్తుతో మైదుకూరులో పోటీ చేసి విజయం సాధించవచ్చని డీఎల్ రవీంద్రారెడ్డి భావిస్తున్నారు.పొత్తులో భాగంగా.... ఇందులో భాగంగా బీజేపీ నేతలతో టచ్ లోకి వెళ్లినట్లు తెలుస్తోంది. ఈ నెల 19వ తేదీన కడపలో బీజేపీ భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసింది. వైసీపీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఈ సభను కడపలోనే బీజేపీ ఏర్పాటు చేసింది. కేంద్ర నాయకులు కూడా ఈ సభకు హాజరుకానున్నారు. వీరి సమక్షంలోనే డీఎల్ రవీంద్రారెడ్డి బీజేపీలో చేరేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. బీజేపీకి కూడా కడప జిల్లాలో నాయకుల అవసరం. దీంతో ఈ నెల 19న డీఎల్ బీజేపీ కండువా కప్పుకునేందుకు సిద్ధమయ్యారు.

## అట్లూరు క్రాస్ రోడ్ లో అంబేద్కర్ భవన నిర్మాణ చేయాలి.....

### డి హెచ్ పి ఎస్ జిల్లా ఉపాధ్యక్షులు పడిగే వెంకటరమణ డిమాండ్

బద్వేలు అట్లూరు క్రాస్ రోడ్డు పక్కన ఉన్న సర్వే నెంబర్ 1007 లో ఉన్న 32 సెంట్ల ప్రభుత్వ స్థలంలో లో అంబేద్కర్ భవనం ఏర్పాటు చేయాలని నిదళిత హక్కుల పోరాట సమితి ( డి హెచ్ పి ఎస్) జిల్లా ఉపాధ్యక్షుడు పి వెంకట రమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. ఆదివారం దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో కబ్జాకు గురైన ప్రభుత్వ స్థలాలను పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా డి హెచ్ పి ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు పి. వెంకటరమణ, జి హెచ్ పి ఎస్ బద్వేలు ఏరియా గౌరవ అధ్యక్షులు వీర శేఖర్ మాట్లాడుతూ ... బద్వేల్ నియోజవర్గంలో అట్లూరు మండలం ఎస్సీ ఎస్టీలు ఎక్కువగా ఉన్నారని, వాళ్ల సమావేశాలు ,ఫంక్షన్లు ,పెళ్లిళ్లు తదితర కార్యక్రమాలు జరుపుకొనుటకు క్రాస్ రోడ్ లో అంబేద్కర్ గారి భవనం చేసి ఏర్పాటుచేసి వారికి సహకరించాలని వైఎస్ఆర్సిపి ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. దళిత ప్రజల సంక్షేమాన్ని కోరుకుంటున్న ప్రభుత్వం దళితుల అవసరాల దృష్ట్యా సామాజిక పరంగా ఈ విషయంపై ప్రభుత్వ ప్రజా ప్రతినిధులు ఆలోచన చేయవలసిన అవసరం ఎంతైనా ఉన్నది, అదే విధంగా ఆ స్థలం కబ్జాకు గురు కాకముందే స్థానిక తాసిల్దార్ గారు గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. వెంటనే ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధుల నుండి భవనాన్ని నిర్మించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డి హెచ్ పి ఎస్ ఏరియా ఉపాధ్యక్షులు జకరయ్య, ఏరియా నాయకులు నిత్య పూజయ్యా, పి వి రమణ, జి యల్ నరసింహులు ,సంజీవ రాయుడు,సుబ్బరాయుడు కదిరి అయ్యా, పెంచలయ్య, అశోక్, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.



# వివేకానందరెడ్డి కూతురి భవిష్యత్తుపై నీలినీడలు

హైదరాబాద్, మార్చి 14, మాజీ మంత్రి, లోక్‌సభ మాజీ సభ్యుడు వైయస్ వివేకానందరెడ్డి అత్యంత దారుణంగా హత్యకు గురయ్యారు. ఆయన హత్య మిస్టరీని ఛేదించేందుకు సీబీఐ ఇప్పటికే రంగంలోకి దిగింది. ఈ హత్యకు సుపారీ పేరుతో కోట్ల రూపాయిలు చేతులు మారినట్లు ఆరోపణలు రావడంతో వాటి సంగతి చూసేందుకు నేడోరేపో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సైతం రంగంలోకి దిగుతోందనే ప్రచారం అయితే హోరెత్తి పోతోంది.మరోవైపు వైయస్ వివేకా హత్యతో ఆమె కుమార్తె వైయస్ సునీత కుటుంబం తీవ్ర కలత చెందుతున్నట్లు తెలుస్తోంది. వైయస్ వివేకానందరెడ్డి హత్యతో ఇప్పటికే ఆమె తీవ్ర దు:ఖంలో ఉన్నారు. సొంత పెద్దనాన్న వైయస్ రాజశేఖరరెడ్డి కుమారుడు వైయస్ జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నా.. తనకు మాత్రం న్యాయం జరగలేదనే ఓ విధమైన ఆందోళనతో పాటు ఆమెను పలు సందేహాలు వెంటాడుతున్నట్లు సునీత కుటుంబ సభ్యులు పేర్కొంటున్నారు.ఆ క్రమంలోనే సునీతతోపాటు ఆమె తల్లి వైయస్ సౌభాగ్యమ్మ కూడా ఏపీ హైకోర్టు మెట్లు ఎక్కారని వారు చెబుతున్నారు. అయితే వైయస్ వివేకా హత్య కేసులో తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న కడప ఎంపీ వైయస అవినాష్ రెడ్డి, ఆయన తండ్రి వైయస్ భాస్కరరెడ్డిలుకు సీఎం వైయస్ జగన్ అండ్ కో అండ దండ ఉన్నాయని కడప జిల్లాలో టాక్ అయితే వైరల్ అవుతోంది. అలాగే వైయస్ ఫ్యామిలీలోని మిగతా వారంతా సునీతతో ఉన్నట్లు తెలుస్తోంది. అయితే తన తండ్రి హత్య కేసులో వైయస్ సునీతకు న్యాయం జరిగుతోందా అంటే.. ఆ పరిస్థితి మాత్రం కనబడడం లేదనే ఓ చర్చ అయితే పులివెందుల సాక్షిగా నడుస్తోంది.అంతేకాదు.. వైయస్ వివేకా హత్య కేసులో ఆయన మాజీ డ్రైవర్ దస్తాగిరి అప్రూవర్‌గా మరి.. సీబీఐ ఎదుట వైయస్ వివేకా హత్య జరిగిన తీరును పూసగుచ్చినట్లు.. వివరించారు. దీంతో ఈ హత్యలో సూత్రధారులు, పాత్రధారులు సైతం కొత్త స్కెచ్ వేసి.. దర్యాప్త సంస్థపైనే కాకుండా.. సీబీఐ అధికారులతోపాటు వైయస్ వివేకా కుమార్తె, ఆమె భర్త రాజశేఖరరెడ్డిపై కూడా ఆరోపణలు సంధించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో వైయస్ సునీత.. తీవ్ర ఒత్తిడికి గురై.. మానసికంగా ఆందోళన చెందినట్లు .. ఆమె సన్నిహితులు పేర్కొంటున్నారు. అసలు తన తండ్రి హత్య ఎందుకు జరిగింది? ఎవరు చేశారు? ఎందుకు చేశారు? ఆయన హత్య.. వెనక ఉన్న కారణాలు ఏమిటి? తన తండ్రి హత్య వల్ల ఎవరికీ లాభం ? ఈ హత్యకు సూత్రధారులు , పాత్రధారులు ఎవరు?... ఇత్యాది అంశాలు ప్రపంచానికి తెలియాలనే ఓ విధమైన పట్టుదలతో వైయస్ సునీత ఉన్నట్లు తెలుస్తోంది. ఇదే విషయాన్ని తన సోదరుడు, ముఖ్యమంత్రి వైయస్ జగన్‌తో చెప్పినా.. తమ బంధువులు వైవీ సుబ్బారెడ్డి, సజ్జలతో మాట్లాడినా.. చివరకు నాటి డీజీపీ గౌతమ్ సవాంగ్‌ను కలిసినా.. తనకు న్యాయం జరుగుతోందన్న చిన్న ఆశ కూడా ఆమెలో లేకుండా పోయిందని సునీత ఫ్యామిలీలోని వారే అంటున్నారు. ఆ తర్వాత.. అసలు విషయం అర్థమై.. సునీత స్వయంగా రంగంలోకి దిగడంతో.. ఆమె తల్లి వైయస్ సౌభాగ్యమ్మ కూడా.. సునీతతో నడిచారని తెలుస్తోంది. ఆ తర్వాత చోటు చేసుకున్న పరిణామాలన్నీ అందరికీ తెలిసినవే.మరోవైపు.. కడప లోక్‌సభ స్థానం నుంచి తాను బరిలోకి దిగుతానంటూ.. వైయస్ వివేకా.. తన అన్న కుమారుడు వైయస్ జగన్ పార్టీలోని కీలక నేతలను సంప్రదించడం. అందుకు వారు నో చెప్పారని తెలుస్తోంది. ఆ క్రమంలో సైకిల్ పార్టీలోకి వెళ్లి.. ఆ పార్టీ తరఫున ఎన్నికల బరిలో నిలవాలని వైయస్ వివేకా భావించడం.. ఆ కొద్ది రోజుల్లోనే ఆయన అత్యంత దారుణంగా హత్యకు గురయ్యారనే టాక్ అయితే కడప జిల్లాలో జోరుగా నడుస్తోంది. వివేకా తనయ వైయస్ సునీత కూడా టీడీపీలోకి వెళు దంటూ.. ఇటీవల ఓ వర్గం మీడియా అయితే గట్టిగానే ప్రచారం చేసింది. అయితే ఇప్పటికే సునీతపై ఓ విధమైన కుట్ర తాలుక .. ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుతం తటస్థంగా ఉన్నా ఆమె.. మరో పార్టీలోకి వెళ్లితే.. సునీత జీవితంపై బలమైన దెబ్బ పడే అవకాశం ఉందని.. ఆ క్రమంలో ఆమె ప్రాణాలకు ముప్ప వాటిల్లే ప్రమాదం కూడా ఉందని ఆమె కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. అయినా సునీతకు రాజకీయాల్లోకి వెళ్లే ఆలోచన అసలు లేనే లేదని ఆమె ఫ్యామిలీలోని సభ్యులే చెబుతున్నారు.ఓ వేళ తన తండ్రి వివేక హత్య కేసులో దోషులు ఎవరనేది తెలితే.. ఆ తర్వాత ఆమె రాజకీయాల్లోకి వచ్చి.. తన తండ్రి వారసత్వాన్ని పుణికి పుచ్చుకుని.. ఆ దిశగా అడుగులు వేసే అవకాశం కూడా లేకపోలేదని వారే అంటున్నారు. ఏదీ ఏమైనా.. వివేకా హత్య కేసులో దోషుల ఎవరనేది తెలిస్తే.. వైయస్ సునీత.. తన పొలిటికల్ ఇన్నింగ్స్ ప్రారంభించే అవకాశాలు వందకు వంద శాతం ఉన్నాయనే చర్చ కూడా కడప జిల్లాలో జోరుగానే నడుస్తోంది.

## శ్రీశైలం స్వామి అమ్మవార్లను దర్శించుకున్న చీఫ్ జస్టిస్

శ్రీశైలం   శ్రీశైలం శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లను సుప్రీం కోర్టు ఛీఫ్ జస్టిస్ ఎన్వీ రమణ సోమవారం రోజు  తెల్లవారుజామున కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు.శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి మహా మంగళహారతి దర్శనానికి విచ్చేసిన జస్టిస్ ఎన్.వి. రమణ దంపతులకు ఆలయ రాజగోపురం వద్ద మంగళవాయిద్యాలతో అర్చక స్వాములు ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వాగతం పలికారు. అనంతరం అయన రత్నగర్భ గణపతి పూజ, శ్రీ మల్లికార్జున స్వామి వారి సుప్రభాత సేవ, మహా మంగళ హారతి కార్యక్రమంలో పాల్గొని, గర్భగుడిలోని మూలవిరాట్ కు  మహాన్యాస రుద్రాభిషేకం చేసారు. అనంతరం భ్రమరాంబ అమ్మవారి కుంకుమార్చన కార్యక్రమంలో పాల్గొన్నారు.అనంతరం వారు వేద పండితుల నుండి ఆశీర్వచనం తీసుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారుతెలంగాణ చీఫ్ జస్టిస్ సతీష్ చంద్ర శర్మ దంపతులు, సుప్రీంకోర్టు రిజిస్ట్రార్ ప్రసన్నకుమార్ సూర్యదేవర, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ ఎ.వి. రవీంద్రబాబు, రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ యం. హరిజవహర్ లాల్, జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు,ప్రిన్సిపల్ జిల్లా జడ్జి  విఆర్కేకే సాగర్, జిల్లా ఎస్పీ సుధీర్ కుమార్ రెడ్డి, ఎస్సీ ఎస్టీ స్పెషల్ జడ్జి  వివియల్ సత్యవతి, మొదటి అదనపు జిల్లా జడ్జి బి. శ్రీనివాస్, ఆత్మకూరు జూనియర్ సివిల్ జడ్జి రాజన్ ఉదయ్ ప్రకాష్,  దేవస్థాన కార్యనిర్వహణాధికారి లవన్నలు తదితరులు సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్  వెంట వున్నారు

## ఈనెల 28. 29 తేదీల్లో జరిగే దేశవ్యాప్త సమ్మె జయప్రదం చేయండి

**సి. ఐ. టి. యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. ఏ. గఫూర్ పిలుపు**

విజయవాడ.      కేంద్రంలో బి.జె.పి ప్రభుత్వ విధానాలు వ్యతిరేకిస్తూ ఈనెల మార్చి 28, 29 తేదీలలో జరిగిన దేశవ్యాప్త సమ్మెలో ఆటో, మోటార్ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలని ఈరోజు సోమవారం రైల్వే స్టేషన్ ఆటో వర్కర్స్ యూనియన్ సి.ఐ.టి.యు ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్ వద్ద విస్తృత సమావేశం జరిగింది. అనంతరం ప్రచారం చేయడం జరిగింది. కేంద్రంలో బి.జె.పి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాల ఫలితంగా ఆటో, మోటార్ రంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం  మోటార్ వెహికల్ చట్ట సవరణ బిల్లును పార్లమెంటులో ఆమోదించడంతో మన రాష్ట్రంలో 21, నెంబర్ జీవో పేరిట వేలాది రూపాయల ఫైన్ లు వేస్తున్నారని గతంలో ఏ ప్రభుత్వాలు కూడా ఆటో, మోటార్ కార్మికులను ఇంత దారుణంగా వేధించలేదని అన్నారు. కార్మిక చట్టాల్లో మార్పులు తీసుకువస్తూ కార్మిక సంఘాలు లేకుండా చేస్తున్నారని ఇటువంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లో సహించేది లేదని అన్నారు. ఇంకొక పక్క ప్రభుత్వ రంగాలైన రైల్వే, ఎల్.ఐ.సి, బ్యాంకు వంటి ప్రభుత్వ రంగాలను ప్రైవేటుపరం చేస్తున్నారని ఇటువంటి కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా జరిగే సమ్మెలో ఆటో, మోటార్ కార్మికులంతా ఐక్యంగా పోరాడి మన హక్కులను సాధించుకోవాలి అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏ.పీ ఆటో అండ్ ట్రాలీ వర్కర్స్ ఫెడరేషన్ సి. ఐ. టి. యు రాష్ట్ర కోశాధికారి కె. దుర్గారావు. సెంట్రల్ సిటీ ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు ఎస్.కె. దుర్గా వలీ. విజయవాడ సిటీ ఆటో వర్కర్స్ యూనియన్ నగర నాయకులు డి. కోటయ్య, ఎ. నాగ బ్రహ్మం, ఎం. హనుమంతరావు, స్థానిక రైల్వే స్టేషన్ నాయకులు సుబ్బరాజు, రఫీ, ప్రభుదాసు, చిన్ని, ఏ.వి రెడ్డి. చిన్న రెహ్మామాన్, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## మందుబాబులకు కౌన్సిలింగ్

మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని కార్పొరేషన్ కార్యాలయం ప్రక్కన గల మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ ఎదుట బహిరంగంగా కొందరు మద్యం సేవిస్తున్నారు ఈ నేపథ్యంలో సోమవారం మధ్యాహ్నం సమాచారం అందుకున్న పట్టణ ఎస్ఐ మహేంద్ర సంఘటనా స్థలానికి చేరుకుని బహిరంగ మద్యం సేవించే వారికి కౌన్సిలింగ్ నిర్వహించి మంగళగిరి పట్టణ పోలీస్ స్టేషన్ కు తరలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు

## విశాఖలో  జనసేన వేడుకలు

విశాఖపట్నం జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు విశాఖలో ఘనంగా జరిగాయి.ఈ పార్టీ కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ ఆద్వర్యంలో పితాపురం కాలనీ సమీపంలో పలు సేవా కార్యక్రమాల మధ్య వేడుకలను నిర్వహించారు.ఈ సందర్బంగా రక్తదాన శిభిరాన్ని ఏర్పాటు చేసి కేక్ కట్ చేసి పార్టీ అధినేత పవన్ కు అభినందనలు తెలిపారు.ఉన్నత స్థాయి ఆశయాలకు అనుగుణంగా పార్టీని స్థాపించిన పవన్ కళ్యాణ్ కు జనసైనికులు అండగా ఉంచి వచ్చె ఎన్నికల్లో అధికారంలోకి వచ్చేందుకు కృషి చేస్తామని కార్పొరేటర్ మూర్తి యాదవ్ తెలిపారు.బహిరంగ సభకు అధికార పార్టీ ఎన్నిఅడ్డకులు పెట్టినా సభను విజయవంతం చేస్తామని చెప్పారు.

# వడివడిగా వంశధార అడుగులు

శ్రీకాకుళం, మార్చి 14, శధార జల వివాదాల ట్రిబ్యునల్ (వీడబ్ల్యూడీటీ) తుది నివేదికపై ఒడిశా అభ్యంతరాలను కేంద్రం తోసిపుచ్చింది. నివేదికపై సంతృప్తి వ్యక్తం చేసింది. ఆంధ్రప్రదేశ్, ఒడిశాలకు సమన్యాయం చేస్తూ వంశధార జలాలను పంపిణీ చేసినందున ట్రిబ్యునల్ గడువు పొడిగించాల్సిన అవసరం లేదని స్పష్టంచేసింది. దాంతో వంశధార ట్రిబ్యునల్‌ను రద్దు చేస్తూ కేంద్ర జల్ శక్తి శాఖ సంయుక్త కార్యదర్శి సంజయ్ అవస్థి గురువారం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేశారు.2017 సెప్టెంబరు 13న ట్రిబ్యునల్ ఇచ్చిన ప్రాథమిక నివేదిక, 2021 జూన్ 21న ఇచ్చిన తుది నివేదికలను సవాలు చేస్తూ ఒడిశా ప్రభుత్వం సుప్రీం కోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్సెల్పీ)లు దాఖలు చేసింది. సుప్రీం కోర్టు స్టే ఇవ్వకపోవడంతో తుది నివేదిక అమలుకు కేంద్రం సిద్ధమైంది.అంతర్రాష్ట్ర నదీ జల వివాదాల (ఐఎస్ఆర్‌డబ్ల్యూడీ) చట్టం?1956 సెక్షన్?6(1) ప్రకారం ట్రిబ్యునల్ తుది నివేదికను అమలు చేసేందుకు కేంద్ర జల్ శక్తి శాఖ వారంలోగా గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసే అవకాశం ఉందని అధికారవర్గాలు తెలిపాయి. తుది నివేదిక అమల్లోకి వస్తే.. ఏపీ, ఒడిశాల్లో అత్యంత వెనుకబడిన ప్రాంతాలను సస్యశ్యామలం చేసే నేరడి బ్యారేజీ నిర్మాణానికి మార్గం సుగమమవుతుందివంశధారపై నేరడి వద్ద బ్యారేజీ నిర్మించి వంశధార ఫేజ్?1 కింద 21 లక్షల ఎకరాలను స్థిరీకరించడంతోపాటు కొత్తగా 45 వేల ఎకరాలకు రెండు పంటలకు నీరందించి శ్రీకాకుళం జిల్లాను సస్యశ్యామలం చేసే పనులకు మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి 2005 ఫిబ్రవరి 25న శ్రీకారం చుట్టారు. ఈ ప్రాజెక్టుపై ఒడిశా అభ్యంతరం వ్యక్తం చేసింది. వంశధార జలాల పంపిణీకి ట్రిబ్యునల్‌ను నియమించాలని కేంద్రాన్ని పట్టుబట్టింది.దీంతో నేరడి బ్యారేజీ నిర్మాణాన్ని తాత్కాలికంగా నిలిపివేసి, కాట్రగడ్డ వద్ద సైడ్ వియర్ నిర్మించేలా మహానేత వైఎస్ ప్రాజెక్టు డిజైన్‌ను మార్చారు. పనులు కూడా చేపట్టారు. ఒడిశా ప్రభుత్వ వినతి మేరకు కేంద్రం 2010లో వంశధార ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేసింది. ఏడేళ్లపాటు సుదీర్ఘంగా విచారించిన ట్రిబ్యునల్.. 2017 సెప్టెంబరు 13న ప్రాథమిక నివేదిక ఇచ్చింది. ఈ నివేదికపై ఒడిశా, ఏపీ ప్రభుత్వాలు వ్యక్తం చేసిన అభిప్రాయాల్ని పరిగణనలోకి తీసుకుని 2021 జూన్ 21న తుది నివేదిక ఇచ్చింది.వంశధారలో 75 శాతం లభ్యతగా ఉన్న 115 టీఎంసీల్లో చెరి సగం (57.5 టీఎంసీలు) చొప్పున రెండు రాష్ట్రాలకు పంపిణీ చేసింది నేరడి బ్యారేజీ వల్ల ఒడిశాలో ముంపునకు గురయ్యే 106 ఎకరాలను ఆ ప్రభుత్వం సేకరించి ఏపీకి అప్పగించాలి. ఇందుకు ఏపీ పరిహారం చెల్లించాలి. నేరడి బ్యారేజీ కుడి వైపున ఏపీ, ఎడమ వైపున ఒడిశా కాలువలు తవ్వుకుని ఆయకట్టుకు నీళ్లందించుకోవచ్చు. బ్యారేజీ నిర్మాణానికి అయ్యే వ్యయాన్ని ఆయకట్టు ఆధారంగా దామాషా పద్ధతిలో రెండు రాష్ట్రాలు భరించాలి. నేరడి బ్యారేజీ నిర్మించాక కాట్రగడ్డ సైడ్ వియర్‌ను తొలగించాలి.  దీన్ని అమలు చేయడానికి కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) సీఈ అధ్యక్షతన రెండు రాష్ట్రాల అధికారులు సభ్యులుగా అంతర్రాష్ట్ర పర్యవేక్షణ కమిటీని ఏర్పాటు చేయాలి.

# విజయవాడ నగర అభివృద్ధికి కట్టుబడి వున్నాము

**మంత్రి వెలంపల్లి**

**42వ డివిజన్లో కమ్యునిటీ హాల్ మరియు రోడ్డును ప్రారంభించిన మంత్రి వెలంపల్లి**

**పవన్ కళ్యాణ్ తన ప్యాకేజి పెంచుకోవడం కోసమే జనసేన ఆవిర్భావ సభ**

**ఏడాది పూర్తి చేసుకున్న విజయవాడ నగర కార్పొరేటర్లకు శు భాకాంక్షలు తెలిపిన మంత్రి వెలంపల్లి**

విజయవాడ స్థానిక 42వ డివిజన్ ప్రియదర్శిని కాలనీ నందు సోమవారం నాడు  30లక్షల వ్యయంతో నిర్మించిన కమ్యూనిటీ హాల్ భవనంను మరియు 15 లక్షల వ్యయంతో నిర్మించినా కుండల  బజారు  రోడ్డు ను  రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు ప్రారంభించారు.అంతరం మంత్రి మాట్లాడుతూనగరపాలక సంస్థ లో కార్పొరేటర్లు గెలిసి నేటికీ ఏడాది కాలం అవుతుందని మా కార్పొరేటర్లు అందరు ఈ ఏడాది కాలంలో వారివారి డివిజన్లలో ప్రజా సమస్యలు తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నారన్నారు.దశాబ్దాలుగా పెండింగ్  లో వున్నా ఈ కుండల బజారు రోడ్డును నేడు మేము అభివృద్ధి పరిచామన్నారు.టీడీపీ హయాంలో  వెయ్యలేని రోడ్డును నేడు మేము వేసి ఈ రోజు ప్రారంభించడం  జరిగిందన్నారు.మరి కమ్యూనిటీ  హాల్ కూడా ఎన్నో ఏళ్లగా పెండింగ్లో వున్నా పని దానిని కూడా మేము నిర్మించి నేడు ప్రారంభించాము. అదేవిధంగా వైయస్ఆర్  పార్కును కూడా నూతన హంగులతో అభివృద్ధి పరిచామన్నారు.ఈ సందర్భాల్లో మంత్రి పవన్ పై  ఘాటుగా విమర్శించారు ఐపీల్ క్రీడాకారుల వేలంపాట మాదిరిగా పవన్ కళ్యాణ్ తన  ప్యాకేజి పెంచుకోవడం కోసమే జనసేన ఆవిర్భావ సభా నిరవహిస్తున్నారన్నారు.పవన్ కళ్యాణ్ వళ్ళ ఈ రాష్ట్రానికి ఎటువంటి ఉపయోగంలేదన్నారు.తన ప్యాకేజి పెంచుకోవడం కోసం ఏడాదికి ఒకటి రొండు సార్లు ఏపీకి వచ్చే పవన్ కు  ప్రజల తరుపున మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు.ఈ కార్యక్రమంలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి,డిప్యూటీ మేయర్లు బెల్లం దుర్గ,అవుతూ శైలజ రెడ్డి,స్థానిక కార్పొరేటర్ పగిడిపాటి చెతన్య రెడ్డి  పార్టీ నాయకులూ వక్కలగడ్డ శ్రీకాంత్,బండారి వెంకట్,శీలం ఈశ్వర రెడ్డి,కేసరి కృష్ణారెడ్డి,రాజు,స్పీడ్ సుబ్బారావు మరియు నగర పాలక సంస్థ అధికారులు వివిధ కార్పొరేషన్ల చేర్మెన్లు,డైరెక్టర్లు, పార్టీ నాయకులు కార్యకర్తలు'పాల్గొన్నారు.



# విలేజ్ బ్యాక్ గ్రౌండ్ తో వ్యాపారాలు

గుంటూరు, మార్చి 14, పోర్టబుల్ క్యాబిన్‌లు చకచకా రెడీ అవుతున్నాయి. చిన్న చిన్న ఇళ్లు, ఫామ్‌హౌస్, సెక్యూరిటీ క్యాపిన్స్, పర్సనల్ ఆఫీసు, రియల్ ఎస్టేట్ ఆఫీసులు, టాయిలెట్స్, స్టోరేజ్ క్యాబిన్స్ స్థలాన్ని బట్టి సైజులు, ఆకారాలు, అందమైన డిజైన్‌లలో తయారవుతున్నాయి. గుంటూరు జిల్లా పెదకాకాని గ్రామ శివారులోని ఆటోనగర్, వెంగళరావునగర్ సమీపంలో సర్వీసు రోడ్డు పక్కనే గత కొంతకాలంగా రెడీమేడ్ గదులు తయారవుతున్నాయి. విదేశాలలో ఇళ్లను ఒక చోట నుంచి మరొక చోటకు మర్చడం, అవసరాన్ని బట్టి ఎత్తు పెంచుకోవడం, తగ్గించుకోవడాన్ని దృష్టిలో పెట్టుకుని ఉత్తరప్రదేశ్‌కు చెందిన మహమ్మద్ తయ్యబ్ సోదరులు బెంగళూరు కేంద్రంగా పోర్టబుల్ క్యాబిన్‌లు నిర్మాణం పనులు ప్రారంభించారు. దేశవ్యాప్తంగా అక్కడక్కడా ఈ తరహా పరిశ్రమ ఏర్పాటు చేసి తయారు చేస్తున్నారు. పెదకాకాని వై జంక్షన్ సమీపంలో పరిశ్రమ ఏర్పాటు చేసుకుని అవసరాన్ని బట్టి క్యాబిన్‌లు సరఫరా చేస్తున్నారు. వర్కర్లను కూడా ఉత్తరప్రదేశ్ నుంచి పిలిపించి నిర్మాణానికి వినియోగించుకుంటున్నారు. వారి వద్ద పనులు నేర్చుకుని ఈ ప్రాంతానికి చెందిన వారే పెదకాకానిలో మూడో క్యాబిన్‌ల తయారీ పరిశ్రమ ఏర్పాటు చేసుకున్నారు. ఈ పోర్టబుల్ క్యాబిన్‌లలో ఇంటీరియల్ డెకరేషన్ ప్రత్యేక ఆకర్షణగా, అందమైన ఇళ్లను తలపిస్తున్నాయి. లక్షరూపాయల నుంచి ఐదు లక్షల రూపాయల వరకూ ప్రజల అవసరాలకు అనుగుణంగా అందంగా ఆకర్షణీయంగా డిజైన్‌లు చేసి ఇవ్వడం ద్వారా ఆర్డర్‌లు పెరుగుతున్నాయని వారు చెబుతున్నారు.  ఇతర జిల్లాల నుంచి ఆర్డర్‌లు వస్తున్నాయని, 25 సంవత్సరాల పాటు మన్నిక ఉంటుందని, వారంటీ బిల్లు ఒక సంవత్సరం పాటు ఫీ సర్వీసు ఉంటుందని, సర్వీసు ఎప్పుడూ అందుబాటులోనే ఉంటుందని నిర్వాహకులు పేర్కొన్నారు. కాకా హోటళ్లు...చాయ్ దుకాణాలు అంటే పురాతన కాలంలో పూరి గుడిసెల్లోనూ..ఆ తర్వాత పెంకుటిళ్లు..పక్కా గదుల్లోనూ దర్శనమిచ్చేవి. ఇప్పుడది పూర్తిగా తనషేప్‌ను మార్చుకుంటుంది. నయాజమానా నయాట్రెండ్ చందానా.. పెద్దపెద్ద సిటీల్లోని కార్పొరేట్ తరహాతో కనిపిస్తున్నాయి. ఒకప్పుడు కంటైనర్లను వివిధ రకాల వస్తువుల్ని తరలించేందుకు వాడుతుంటారు. సిమెంట్, ఇటుకలు, ఐరన్ అనే మాటేలేకుండా ఎంచక్కా ట్రెండీగా వీటిని తయారు చేస్తున్నారు. కంటైనర్‌లను కేవలం రవాణాకే కాకుండా ఇల్లు.. వ్యాపార దుకాణాలుగా మార్చి వినియోగిస్తున్నారు. పట్టణాల్లోనే కాకుండా వాటిని మారుమూల పల్లెల్లోనూ ఏర్పాటు చేయడంతో అవి అందర్ని అకర్షిస్తున్నాయి. విదేశాల్లో నడిచే ఈ కొత్త ట్రెండ్ మన దేశంలోనూ వేగంగా విస్తరించడం విశేషం. పల్లె, పట్టణం అనే తేడా లేకుండా ఇప్పుడిప్పుడే వీటికి విశేష ఆదరణ లభిస్తోంది. సాధారణంగా చాయ్ లేదా ఫాస్ట్‌ఫుడ్ ఇతర వ్యాపార దుకాణాలను ఏర్పాటు చేయాలంటే ఎక్కడైనా కూడళ్లలో నిర్మించిన షాపింగ్ కాంపెక్ల?స్‌లోని గదుల్ని అద్దెకు తీసుకోవాలి. అడ్వాన్స్‌లు, అవి నిర్మించిన గదులు మనకు అనుకూలంగా లేకుండా మార్పులు చేర్పులకు నిర్మాణాలు, డెకరేషన్లకు అదనంగా డబ్బు ఖర్చు పెట్టాల్సి వచ్చేది. తీరా మనం ఏర్పాటు చేసిన షాపు 'క్లిక్' కాకున్నా మనకు 'లక్' లేకున్నా..అప్పటి వరకు చేసిందంతా బూడిదలో పోసిన పన్నీరు అవుతుంది.  కంటైనర్‌లకు 50 ఏళ్ల తర్వాత వాటి జీవిత పరిమితకాలం అయిపోతుంది.వాటిని షిప్పింగ్‌కు వాడకూడదు. అలాంటి వాటిని వేస్ట్‌గా పోనివ్వకుండా తిరిగి ఉపయోగంలోకి తెస్తున్నారు.  వాటిని స్క్రాబ్ కింద కొని వీటికి నిపుణులు అందమైన రూపునిస్తూ అద్భుతంగా మలుస్తున్నారు. షిప్పింగ్ కోసం వినియోగించే మెటల్ కంటైనర్లను పోర్టబుల్ హౌసెస్, ఆఫీస్ క్యాబిన్, హోటల్స్, టీస్పాట్, ఫ్యాన్సీ, కిరణా వంటి బిజినెస్ షాప్స్, మెటల్ క్వారీల వద్ద సేఫ్టీరూమ్స్, ఫాంహౌస్‌ల వద్ద మినిగెస్ట్‌హౌస్‌లు, భవన నిర్మాణాల సమయంలో స్టాక్‌గోడవున్ వంటి వాటికి ఈకంటైనర్లను వినియోగిస్తున్నారు. లోపల అంతా బైసన్, ఎంటీఎ బోర్డులు, సీలింగ్, వాల్‌పేపర్లు, డోర్స్, యూపీవీసీ విండోస్, వినైల్‌ఫ్లోర్స్, టైల్స్, ఎల్‌ఈడీ లైట్లు, ఫ్యాన్లు, స్విచ్‌బోర్డులు, కబోర్డ్స్, అడ్జస్ట్‌ఫ్యాన్, ఏసీ, టీవీ పాయింట్స్, కంప్యూటర్స్, హాలు, కిచెన్, వాష్‌రూం, 1000లీటర్ల పైన ట్యాంక్, లోహం కావడంతో వేడి రాకుండా రాక్‌వోల్ వినియోగించి ప్రీమియం లుక్ తీసుకువస్తున్నాం.తక్కువ ఖర్చుతో అన్ని సదుపాయాలతో కొద్దిపాటి స్థలంలోనే ఏర్పాటు చేసుకునే వీలుంది. ఒకచోట నుంచి మరోచోటకు సులభంగా తరలించుకోవచ్చు. మన అవసరం తీరాక కొన్నధరకు పెద్దగా నష్టం రాకుండా తిరిగి వీటిని విక్రయించుకోవచ్చు. జీఏసిస్టం, ఎంఎస్‌సిస్టం అనే రెండు రకాలుగా సెమీ, ఫుల్లీ ఫర్నిచర్ సౌకర్యాలతో వీటిని తయారు చేస్తున్నారు. ముందుగానే రెడీమెడ్‌గా తయారు చేసి ఉన్నందున ఎప్పుడు కావాలంటే అప్పుడే తెచ్చుకోవచ్చు. రోజురోజుకు వీటికి మంచి ఆదరణ పెరగడంతో ఇప్పుడు రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లోనూ, ప్రధాన పట్టణాల్లోనూ వీటి తయారీ కార్ఖానాలు వెలిశాయి.పక్కాగృహ నిర్మాణాల మాదిరిగానే వీటి ధర అడుగుల చొప్పున ఉంటుంది. ఒక్కొక్క అడుగు సుమారు రూ.900 నుంచి రూ.1200 వరకు వారు అందించే నాణ్యతను బట్టి అందిస్తున్నారు. షిప్పింగ్ కంటైనర్..8గీ40 లేదా 8గీ20 మాత్రమే దొరుకుతాయి. పోర్టక్యాబిన్స్‌తో పోల్చుకుంటే ఇవి స్టాండెండ్‌గా ఉండడంతో పాటు ధరలోనూ సుమారు రూ.లక్ష వ్యత్యాసం ఉండోచ్చు. ఎందుకంటే ఇది స్టాండెడ్‌గా ఉంటాయి. ఒక్కొక్క షాపు ధర రూ.లక్ష నుంచి రూ.6.50 లక్షలు పడుతుంది. సింగిల్ బెడ్‌రూం కలిగిన ఇల్లు రూ.30 లక్షలు పలికే ఈరోజుల్లో కంటైనర్ పోర్టబుల్ హౌస్ 20గీ8 సైజు ఇల్లు రూ.4.50 లక్షలు, అదే ఫుల్లీ ఫర్నిచర్‌తో రూ.6.50 లక్షలు, 40గీ8 ఇల్లు రూ.8 లక్షలు, ఫుల్లీ ఫర్నిచర్ హౌస్ రూ.8.50 లక్షలకు రావడంతో అంతా ఇటువైపు దృష్టిని సారిస్తున్నారు.

# జల్ జీవన్ మిషన్ పథకాన్ని శంకుస్థాపన చేసిన సర్పంచ్ కురడ బోయిన సుబద్ర

విశాఖపట్నం అరకులోయ మండలంలోని చొంపి పంచాయతీ పప్పుడు వలస గ్రామంలో జల్ జీవన్ మిషన్ పథకాన్ని చొంపి పంచాయతీ సర్పంచ్ కురడబోయిన సుభద్ర భర్త జీనబందు, తెలుగు దేశం పార్టీ చొంపి,శిరగం సెగ్మెంట్ ఎంపిటీసి సభ్యురాలు సోమెలి జానకి భర్త బాలు, ఆధ్వర్యంలో పప్పుడు వలస గ్రామంలో రక్షిత మంచినీటి సదుపాయం కోసం పైపు లైన్ కాలువలు త్రవ్వడం కొరకు ఇరువురు కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు.వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జల్ జీవన్ మిషన్ పథకం మన గిరిజన ప్రాంతం అయిన పప్పుడు వలస గ్రామంలో  ప్రతి గడగడపకు కొలాయి కనెక్షన్ లు ఇవ్వడం జరిగింది ఈ పథకం ద్వారా త్రాగు నీటి సదుపాయం కల్పించడంపై పంచాయతీ సర్పంచ్, ఎంపీటీసీ హర్షం వ్యక్తంచేశారు.ఈ పథకం 6 లక్షల 10 వేల రూపాయలు నిధులతో నిర్మాణం చేపట్టనున్నారు. గిరిజన ప్రాంతంలో చాలా గ్రామాల్లో మంచినీటి సౌకర్యం లేకపోవడంతో

**సంతోషాన్ని వ్యక్తం చేసిన గ్రామస్థులు**

గిరిజనులు తీవ్రంగా ఇబ్బందులకు గురవుతున్నారు.ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం గిరిజన ప్రాంతాంలో ఏ ఏ గ్రామాలకు మంచి నీటి సమస్య ఉందో ఆయా గ్రామాలకు జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా రక్షిత మంచినీటి సదుపాయం కల్పించడం గ్రామ ప్రజలకు త్రాగు నీటి కష్టాలు తీరుతుందని భావిస్తున్నామని దూర ప్రాంతం కు వెళ్లి మంచి నీరు తీసుకురావడం మహిళలకు కష్టాలు తప్పుతుందని  అన్నారు.వేసవి కాలం సమీపిస్తుండంతో దాని దృష్టి లో ఉంచుకొని ఈ పథకం త్వరితగతిన పూర్తి చేసి గిరిజన ప్రజలకు త్రాగు నీటి సదుపాయం కల్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో అరకు పార్లమెంట్ తెలుగు దేశం పార్టీ యువత కార్యదర్శి సోమెలి బాలు, డీసీఎంసీ మార్కెటింగ్ మెంబర్ శుక్రయ, వార్డు సభ్యులు సాగరజన్ని రాము, గుడివాడ సన్యాసమ్మ,రొశరబోయిన రాంబాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# వైఎస్సార్ పెళ్లి కానుక అమలు చేయాలి

కడప మేనిఫెస్టో లో చెప్పిన విధంగా వైయస్సార్ పెళ్లి కానుక  అమలు చేయాలి, అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని  ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎన్. తులసిరెడ్డి డిమాండ్ చేసారు.  అగ్రిగోల్డ్ బాధితులను, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ చెల్లేమ్మలను ముఖ్యమంత్రి నమ్మించి మోసగించడం భావ్యం కాదు.  వైయస్సార్ పెళ్లి కానుక కింద ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ ల చెల్లమ్మల వివాహానికి రూ. లక్ష  , బీసీ చెళ్ళమ్మల వివాహానికి రూ. 50 వేలు ఇస్తామని మేనిఫెస్టో లో పేర్కొనడం జరిగింది.  3 సంవత్సరాలు అయ్యింది పైసా ఇవ్వలేదని అయన అన్నారు.

# అన్నదాన కార్యక్రమాన్ని తిరిగి ప్రారంభించండి

గోకవరం, మార్చి 14, ( విభారె)  కరోనా నిబంధనలు కారణంగా నిలిపివేసిన అన్నదాన కార్యక్రమాన్ని తిరిగి ప్రారంభించాలని, భక్తులకు భగవంతుని ప్రసాదం తీసుకునే అవకాశం కల్పించాలని సనాతన ధర్మ ప్రబోధన సమితి వ్యవస్థాపకులు తోట సాయిబాబా విజ్ఞప్తి చేశారు.. దీనికి సంబంధించి దేవాదాయశాఖ కమిషనర్ కు లేఖ రాశారు.. దీనికి సంబంధించిన వివరాలను సాయిబాబా తెలిపారు.. గోకవరం మండలం తంటికొండ గ్రామంలో ప్రసిద్ధిగాంచిన వెంకటేశ్వర స్వామి పుణ్యక్షేత్రం ఉంది.. చుట్టుపక్కల గ్రామాల నుండే కాకుండా, ఇతర ప్రాంతాల నుండి వేల సంఖ్యలో భక్తులు స్వామివారి దర్శనానికి రావటం జరుగుతుంది.. గతంలో ప్రతి శనివారం ఇక్కడ అన్నదాన కార్యక్రమం జరిగేది.. ఆలయానికి వచ్చిన

## దేవాదాయశాఖకు తోట సాయిబాబా లేఖ

భక్తులు స్వామివారి దర్శనం అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొనేవారు.. కరోనా నిబంధనలు కారణంగా అన్నదానాన్ని నిలిపివేశారు.. ఇప్పటికి అధికారులు ప్రారంభించలేదు.. పుణ్యక్షేత్రానికి వచ్చే దూర ప్రాంతాల భక్తులు ఇబ్బందులు పడుతున్నారు...ఇటువంటి విషయాలను పరిశీలన చేసి, తంటికొండ దేవస్థానం పై తిరిగి అన్నదాన కార్యక్రమం ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు.. దేవాదాయ శాఖ కమిషనర్ కు రాసిన లేఖలో భక్తుల అభిప్రాయాలు వివరించారు..అన్నదాన కార్యక్రమాన్ని తిరిగి ప్రారంభించాలని కోరారు..

# గంగాధరలో జలదీక్ష చేసిన కాంగ్రెస్ నాయకులు

## మేడిపల్లి సత్యంను అరెస్ట్ చేసిన పోలీసులు

చొప్పదండి మార్చి 14, ( విభారె) ఎల్లంపెల్లి నీటితో నారాయణపూర్ రిజర్వాయర్ నింపి ఎండిపోతున్న పంట పొలాలను కాపాడాలని డిమాండ్ చేస్తూ కరీంనగర్ జిల్లా గంగాధర మండల తహశీల్దారు కార్యాలయం ఎదుట కాంగ్రెస్ శ్రేణులు రైతులతో కలిసి జలదీక్షకి దిగిన చొప్పదండి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి మేడిపల్లి సత్యంను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ కి తరలించారు. ఈ సందర్భంగా మేడిపల్లి సత్యం మీడియాతో మాట్లాడుతూ రబీ సీజన్లో పంటలకు నీరు అందించు విషయంలో ఎటువంటి ప్రణాళిక సిద్ధం చేయకుండా గత నెల రోజులుగా రైతులతో కలిసి కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఆందోళనలతో అధికారులు ఇప్పుడు మరమ్మత్తుల పేరుతో కాలయాపన చేయడం చూస్తుంటే స్థానిక ఎమ్మెల్యే రవిశంకర్ అసమర్థతకి చేతగానితనానికి అద్దం పడుతుందన్నారు. ఇక్కడి ప్రాంత అవసరాలను తీర్చకుండా రైతుల ఇబ్బందులను ఏమాత్రం పట్టించుకోకుండా ఎగువ ప్రాంతాలైన మల్లన్నసాగర్ కొండపోచమ్మ కి నీళ్ళు తీసుకెళ్ళడం చూస్తుంటే పాలకులకు ఈ ప్రాంతం పైన ఉన్న ప్రేమని నిబద్ధతను సూచిస్తుందన్నారు. 48 గంటల్లో ఎల్లంపెల్లి నుండి నారాయణపూర్ రిజర్వాయర్ కి నీటిని విడుదల చేయాలని లేకుంటే రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు మరిన్ని చేపడతామని అవసరమైతే అసెంబ్లీ ముట్టడి చేపట్టడానికైన వెనకాడబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గంగాధర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పురుమల్ల మనోహర్, చొప్పదండి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి,బోయినిపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వన్నెల రమణారెడ్డి, రామడుగు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొమ్మరవేణి తిరుపతి, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులలు దుబ్బాసి బుచ్చయ్య, భీంరెడ్డి మహేశ్వర్ రెడ్డి, ఎంపీటీసిలు మల్యాల శోభన్, ఉయ్యాల శ్రీనివాస్ గౌడ్, జవ్వాజీ హరీష్,గంగాధర కిసాన్ సెల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బూర్గు గంగయ్య, మాజీ సర్పంచ్ లు బత్తిని శ్రీనివాస్ గౌడ్, రాజమల్లు, నేరెల్ల పర్శరాం గౌడ్, పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు ఎండిపోతున్న పంటపొలాల గ్రామాల రైతులు పాల్గొన్నారు...

# ప్యూర్ స్మైల్ చారిటీ అధినేత్రి షేక్ పర్వీన్ కు మహిళా దినోత్సవ సత్కారం

నెల్లూరు మార్చి 14, ( విభారె)ప్యూర్ స్మైల్ చారిటీ అధినేత్రి షేక్ పర్వీన్ కు అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఈ పురస్కారం లభించింది. స్థానిక పురమందిరంలో సృజన స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ పురస్కారాలు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా, విశిష్ట సత్కార గ్రహీతగా జానపద కళాకారుల ఆశాజ్యోతి, దీన జన బాంధవులకు అమ్మ సమానురాలు, ప్రసన్న లక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ అధినేత్రి ,దైవమాత డాక్టర్ గడ్డం ప్రసన్న లక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె వివిధ సామాజిక రంగాలలో సేవలందించిన మహిళామణులను సాంప్రదాయబద్ధంగా ఘనంగా సన్మానించారు. అందులో భాగంగానే పేదవారి పెదవులపై చిరునవ్వు, వారి కళ్ళల్లో సంతోషకరమైన వెలుగును చూసేందుకు ఏర్పాటుచేసిన ప్యూర్ స్మైల్ చారిటీ స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా అభాగ్యులను ఆసరాగా నిలుస్తున్న స్మైల్ ఛారిటీ వ్యవస్థాపక అధినేత్రి షేక్ పర్వీన్ కు దైవ మాత డాక్టర్ గడ్డం ప్రసన్న లక్ష్మి చేతుల మీదుగా ఘన సన్మానం జరిగింది. ఈ సందర్భంగా పర్వీన్ మాట్లాడుతూ ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్న అన్న నినాదానికి ప్రాణం పోసిన సంఘసేవకురాలు మదర్ తెరిసా స్ఫూర్తితో పేదవాళ్ళ కళ్లలో వెలుగులు, వారి పెదాల మీద చిరునవ్వు చూసి ఆనందించడమే లక్ష్యంగా ప్యూర్ స్మైల్ చారిటీ స్వచ్ఛంద సేవా సంస్థలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 2017 సెప్టెంబర్ నెలలో ప్రారంభించబడిన స్మైల్స్ చారిటీ ఆధ్వర్యంలో బడుగు బలహీన వర్గాల నిరుపేద ప్రజలతోపాటు ఆశ్రయం కోల్పోయి వివిధ ఆశ్రమాలలో తలదాచుకుంటున్న నిరుపేదలకు తన వంతు బాధ్యతగా సేవా సమితి సహకారం అందించడం జరుగుతుందన్నారు. వికలాంగులకు, వృద్ధులకు రోగులకు తన వంతు ఆర్థిక సహకారం అందించాలనే సంకల్పంతో 2018 నుండి కార్యక్రమానికి శ్రీకారం చూడడం జరిగిందన్నారు. సుకన్య సమృద్ధి పథకం కింద 2019లో 30 మంది పేద పిల్లలకు నెలకు 1000 రూపాయల చొప్పున ఇప్పటికీ చెల్లిస్తున్నాం అని తెలిపారు. పెళ్ళికానుక అనే కార్యక్రమం ద్వారా పేద ఆడపిల్లలకు, తల్లిదండ్రులు కోల్పోయిన అభాగ్యులకు ఆర్థిక సహాయం తో పాటు సాంప్రదాయ బద్ధ బహుమతి ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ క్రమంలో 2020లో ఆహార బంధు కార్యక్రమం ఏర్పాటుతో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నానని తెలిపారు. వివిధ ఆశ్రమాలకు తన వంతు సహకారం అందించడంతో పాటు నిత్యం ఆశ్రమాల యాజమాన్యాలతో పరస్పర కోఆర్డినేషన్ చేస్తుంటానని తెలిపారు. విద్యా వికాస్ కార్యక్రమం ద్వారా నిరు పేద పిల్లలకు కాలేజీ ఫీజులు ,ల్యాప్టాప్ ,పుస్తకాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. కులమతాలకు అతీతంగా పేద మహిళలకు వారి వారి సాంప్రదాయం ప్రకారం శ్రీమంతాలు చేసుకుంటామని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సృజన స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు దగ్గుబాటి రాధా కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ పురస్కారాన్ని సంఘసేవకురాలు, దైవ మాత డాక్టర్ గడ్డం ప్రసన్న లక్ష్మి చేతుల మీదుగా అందుకోవడం సంతోషకరంగా ఉందన్నారు.

# మీ చేతుల్లోనే పిల్లల ఆరోగ్యం..



అసలే కరోనా కాలం.. పిల్లల ఆహారం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం చాలా ముఖ్యమని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. బలమైన ఆహారం ద్వారా పిల్లల్లో రోగనిరోధక శక్తి మెరుగుపడటంతోపాటు జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, మెదడు పనితీరు చురుకుగా మారుతుంది. మన శరీరంలోని ఇతర భాగాల మాదిరిగానే మనం తినే ఆహార పోషకాలు మెదడుకు చేరుతాయి. కావున పిల్లలకు మరింత పోషకమైన ఆహారం ఇవ్వాలి. పిల్లల ఆహారంలో ఎలాంటి పదార్థాలను చేర్చాలో ఒకసారి తెలుసుకోండి. దీనివల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుందని.. ఆరోగ్యవంతంగా మారుతారని పేర్కొంటున్నారు. అవేంటో ఇప్పుడు చూద్దాం..

గుడ్లు..పిల్లలకు అల్పాహారంలో గుడ్లు ఇవ్వాలి. గుడ్లలో కేలరీలు, ప్రోటీన్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు, ఫోలేట్, కాల్షియం, ఫాస్ఫరస్, సెలీనియం, విటమిన్ ఎ, విటమిన్ బి5, విటమిన్ బి12, విటమిన్ బి, విటమిన్ ఇ, విటమిన్ కె, విటమిన్ బి6 సమృద్ధిగా ఉంటాయి. ఇవి జ్ఞాపకశక్తిని పెంచడంలో సహాయపడతాయి.

చేపలు..ఒమేగా 3 ఫ్యాటీ ఆమ్లాలు ఫిష్ లో ఎక్కువగా ఉంటాయి. ఇవి మెదడు అభివృద్ధికి, ఆరోగ్యానికి ప్రయోజనం చేకూరుస్తాయి. సాల్మన్, మాకెరెల్, ట్యూనా, ట్రౌట్, సార్డిన్స్, హెర్రింగ్ వంటి చేపలలో ఒమేగా-3 ఫ్యాటీ ఆమ్లాలు ఎక్కువగా ఉంటాయి. వారానికి ఒకసారి పిల్లల ఆహారంలో చేపలను చేర్చాలని సూచిస్తున్నారు.

ఓట్స్..పిల్లల ఆహారంలో ఓట్స్ ను చేర్చడం మంచిది. ఓట్స్ మెదడుకు మంచి శక్తి వనరు. దీనిలో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. ఓట్స్‌లో విటమిన్ ఇ, బి కాంప్లెక్స్, జింక్ కూడా ఉంటాయి. ఇవి పిల్లల మెదడును చురుగ్గా చేస్తాయి. వీటితోపాటు ఆహారంలో యాపిల్స్, అరటిపండ్లు, బ్లూబెర్రీలు, బాదం పప్పును కూడా చేరిస్తే బలమైన పోషకాలు లభిస్తాయి.

డార్క్ చాక్లెట్ పిల్లలు చాక్లెట్ తినడానికి ఇష్టపడతారు. ఇలాంటి సందర్భంలో మీరు ఇతర చాక్లెట్ల కాకుండా డార్క్ చాక్లెట్ ఇస్తే మేలని నిపుణులు సూచిస్తున్నారు. డార్క్ చాక్లెట్ లో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇది ఒత్తిడిని సైతం తగ్గిస్తుంది. కానీ ఎక్కువగా తీసుకోవడం మంచిది కాదు.

అవకాడో అవొకాడోలను సూపర్ ఫుడ్ అని కూడా అంటారు. వీటిలో ఒమేగా-3 ఫ్యాటీ ఆమ్లాలు, ఫైటోకెమికల్స్, ఫైబర్ పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. వీటితో పాటు అవకాడోలో పొటాషియం కూడా ఉంటుంది. వీటిని పిల్లల ఆహారంలో చేర్చడం ఉత్తమం.

ఆకుకూరలుఆకుకూరల్లో విటమిన్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి మన శరీరానికి ప్రయోజనకరంగా ఉంటుంది. అందుకే ఆకుకూరలను పిల్లల ఆహారంలో చేర్చాలి. వీటితోపాటు టమాటాలు, చిలగడ దుంపలు, గుమ్మడి, క్యారెట్లు చేరిస్తే మేలని నిపుణులు సూచిస్తున్నారు.

పాలు, పెరుగు, జున్ను..పాలు, పెరుగు, జున్నులో ప్రోటీన్, బి విటమిన్లు ఎక్కువగా ఉంటాయి. ఇవి మెదడు న్యూరోట్రాన్స్మిటర్లు, ఎంజైమ్ ల అభివృద్ధికి దొహదపడతాయి. దీంతోపాటు ఈ పదార్థాల్లో కాల్షియం కూడా ఎక్కువగా ఉంటుంది. కావున పిల్లల్లో దంతాలు, ఎముకలు బలంగా పటిష్టంగా తయారవుతాయి.

# పాలల్లో బాదం పొడి వేసుకొని తీసుకుంటే ఈ సమస్యలు రావు..!

పాలు ఆరోగ్యానికి చాలా మంచిది. పాలు తాగడం వల్ల రోగ నిరోధక శక్తి కూడా పెరుగుతుంది.అదేపాలల్లోబాదం పొడి వేసుకుని తాగితే ఆరోగ్యానికి మరింత మేలు కలుగుతుంది. ఎన్నో అనారోగ్య సమస్యలను కూడా తొలగించుకోవచ్చు.పాలలో క్యాల్షియం సమృద్ధిగా ఉంటుంది మరియు ఇతర పోషకాలు కూడా ఉంటాయి. ప్రతి రోజు నిద్ర పోయే ముందు పాలలో కాస్త బాదంపొడివేసుకునితీసుకుంటే ఆరోగ్యానికి చాలా మేలు కలుగుతుంది. అయితే ఇలా తీసుకోవడం వల్ల ఎటువంటి సమస్యలు ఉండవు అనేది ఇప్పుడు చూద్దాం



బాదం అజీర్తిని పోగొడుతుంది:బాదం పాలు తాగడం వల్ల జీర్ణ సమస్యలు ఉండవు. పాలల్లో బాదం కలిపి తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి చాలా మేలు కలుగుతుంది. బాదం లో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. ఇది జీర్ణ సమస్యలను తొలగిస్తుంది. అలాగే కాన్స్టిపేషన్, గ్యాస్ సమస్యలు కూడా ఉండవు.ఒత్తిడిని దూరం చేస్తుంది:ఆయుర్వేదం ప్రకారం పాలు తాగడం వల్ల రీప్రొడక్టివ్ టిష్యూస్ కి ఎనర్జీ వస్తుంది అదే విధంగా ఎక్కువ సేపు ఆకలి వేయకుండా ఉంటుంది.కాబట్టి ఇలాతాగడం వల్ల అధికంగా తినకుండా అది చూసుకుంటుంది.మంచి నిద్ర పొందొచ్చు:బాదం పొడిని పాలల్లో వేసుకుని తీసుకోవడం వల్ల మంచి నిద్ర ఉంటుంది ప్రతి రోజూ రాత్రి నిద్రపోయే ముందు తాగడం వల్ల ప్రశాంతంగా ఉండొచ్చు మరియు నిద్ర కూడా బాగా పడుతుంది. అలానే మంచి ఎనర్జీ కూడా వస్తుంది.

# శరణ్ ని వదిలే ప్రసక్తే లేదు : బెల్లంకొండ సురేష్



ప్రముఖ నిర్మాత బెల్లంకొండ సురేష్ ఆయన తనయుడు హీరో బెల్లంకొండ శ్రీనివాస్ లపై చీటింగ్ కేసుని నమోదు చేస్తూ శరణ్ అనే వ్యక్తి బంజారా హిల్స్ పోలీస్టేషన్ లో కేసు ఫైల్ చేయడం సినీ వర్గాల్లో సంచలనం సృష్టించింది. ఫైనాన్షియర్ గా చెప్పుకున్న శరణ్ తనని ఆ ఇద్దరు నమ్మించి మోసం చేశారని సినిమా తీస్తామంటూ 85 లక్షలు కాజేశారని ఈ విషయంలో తాను మోసపోయానని శరణ్ బంజారా హిల్స్ పోలీసుల్ని ఆశ్రయించిన విషయం తీవ్ర కలకలం రేపింది. అయితే ఈ విషయంపై ఆగ్రహాన్నివ్యక్తం చేసిన బెల్లంకొండ సురేష్ శరణ్ ని ఎట్టిపరిస్థితుల్లో వదిలే ప్రసక్తిలేదని సంచలన వ్యాఖ్యలు చేశారు. శనివారం ప్రత్యేకంగా మీడియా ముందుకొచ్చిన బెల్లంకొండ సురేష్ ఈ సందర్భంగా సంచలన వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యతని సంతరించుకుంది. నన్ను నా ఫ్యామిలీ ని ఇబ్బంది పెట్టేందుకు కొంత మంది పన్నిన కుట్రలో భాగంగానే నా పై కేసు నమోదు చేశారని నాకు శరణ్ ఎలాంటి డబ్బు ఇవ్వలేదని స్పష్టం చేశారు. నా పై నా కొడుకు పై కావాలనే కుట్ర చేసి ఇబ్బందులకు గురి చేస్తున్నారని శరణ్ ఒక్క పైసా మాకు ఇవ్వలేదు డబ్బులు ఇచ్చినట్టుగా సాక్ష్యాలు వుంటే పోలీసులకు ఇవ్వాలి. శరణ్ తో కలిసి కొంత మంది వ్యక్తులు నా కుటుంబంపై కుట్ర చేస్తున్నారు. నాకు డబ్బులు ఇచ్చినట్టుగా ఆధారాలు చూపించకపోతే పరువు నష్టం దావా వేస్తా. నా ఫ్యామిలీ ఎదుగుదలని చూసి ఓర్వలేకే కేసులు పెడుతున్నారు. విచారణకు ఖచ్చితంగా సహకరిస్తా. గత ఐదేళ్లుగా ఎలాంటి ఫంక్షన్ లకు రాకుండా మా పని మేము చేసుకుంటున్నాం. అలాంటి మమ్మల్ని కావాలనే ఇరికించే ప్రయత్నం చేస్తున్నారు. దీని వెనక పెద్ద వ్యక్తి వున్నారు. అది ఎవరో సాక్ష్యాధారాలతో సహా సోమవారం బయటపెడతా అన్నారు బెల్లంకొండ సురేష్. ఆయన ఇంకా మాట్లాడుతూ 'శరణ్ నా పిల్లల జోలికి వచ్చాడు. నా పిల్లలు నాకు పంచ ప్రాణాలు. శరణ్ ను ఎట్టిపరిస్థితుల్లోనూ వదిలే ప్రసక్తే లేదు. తనని లీగల్ గా పతనం చేస్తా. శరణ్ ది మాఊరే.. ప్రతీ వారం ఫోన్ చేసి టికెట్ లు కావాలని వేధించే వాడు. అతని బాధ తట్టుకోలేక టికెట్ లు ఇవ్వమని నేనే చెప్పాను. తను నా కొడుకుల జోలికి వచ్చాడు. అలాంటి వ్యక్తికి ఖచ్చితంగా బుద్ధి చెబుతాను. అతన్ని క్షమించను. బ్లాక్ మెయిల్ లో భాగంగానే ఇదంతా చేస్తున్నారు' అంటూ శరణ్ పై బెల్లంకొండ సురేష్ నిప్పులు చెరిగారు.

# అలిగిన ఫ్యాన్స్! రామ్– భీమ్ ఎమోజీలేవీ జక్కన్నా?

యంగ్ టైగర్ ఎన్టీఆర్– మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ కలయికలో వస్తున్న తొలి పాన్ ఇండియా సినిమా ఖీఖీఖీ ప్రపంచవ్యాప్తంగా ఈనెల 25న విడుదల కానుంది. ఈ సందర్భంగా టీమ్ ప్రమోషన్స్ లో వేగం మరింతగా పెంచనుంది. ప్రపంచవ్యాప్తంగా అందరూ ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న సినిమా ఖీఖీఖీ అంతకంతకు ఎగ్జయిట్ మెంట్ పెంచుతోంది. అభిమానులతో పాటు సామాన్య ప్రేక్షకుల్లోనూ ఉత్సాహం నెలకొంది. ఉత్సాహాన్ని రెట్టింపు చేసేందుకు



ఇప్పుడు స్పెషల్ సాంగ్ ని టీమ్ విడుదల చేయనుంది. ఈ పాటతో ప్రమోషన్ మరో లెవల్ కి చేరనుంది. ఇక మూవీ అప్ డేట్స్ వీడియోలతో జాతర మొదలు కానుంది. అంతా బాగానే ఉంది కానీ జక్కన్న కొన్నిటిని మర్చిపోయారని అభిమానులు ఆరోపిస్తున్నారు. తాజా ట్రెండ్ లో ట్విట్టర్ ఈమోజీ ప్రచారం ఎంతో ఉత్కంఠ పెంచుతోంది. అలాంటప్పుడు రామ్ – భీమ్ ఈమోజీని రాజమౌళి ఎందుకని పట్టించుకోరు? అంటూ నిలదీస్తున్నారు ఫ్యాన్స్ . ఈ విషయంలో తీవ్ర నిరాశలో ఉన్నారు. తాజాగా ధనుష్ తమిళ చిత్రం మారన్ డిస్నీ ప్లస్ హాట్ స్టార్ లో విడుదలైంది. ధనుష్ కోసం దాని స్వంత ట్విట్టర్ ఎమోజిని కలిగి ఉంది. ఇది ఈ చిన్న చిత్రానికి ఉత్సాహాన్ని కలిగించడానికి సహాయపడింది. అలాగే దళపతి విజయ్ నటించిన బీస్ట్ ఎమోజీని కలిగి ఉంది. ఇది అభిమానుల నుంచి ప్రశంసలు అందుకుంటోంది. ఇలాంటి సమయంలో దేశమంతా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రం అయినప్పటికీ రాజమౌళికి ఆర్.ఆర్.ఆర్ కు సొంత ఎమోజీ ఎందుకు లభించలేదని అభిమానులు ప్రశ్నిస్తున్నారు. అభిమానులు రామ్– భీమ్ కోసం ప్రత్యేక ఎమోజీలను కోరుకుంటున్నారు. వాటిని ట్విట్టర్ లో ప్రత్యక్ష ప్రసారం చేయడానికి ఇది సరైన సమయం అని నినదిస్తున్నారు. రాజమౌళి తో పాటు ఈ విషయంలో తారక్ – చరణ్ కూడా కేర్ తీసుకోవాలని కోరుకుంటున్నారు. అయితే ప్రమోషన్స్ లో వేగం ఇప్పుడే కదా పెరిగింది. తొందర్లోనే ఫ్యాన్స్ కోరిక నెరవేరేందుకు ఛాన్సుందని కూడా మరోవైపు టాక్ వినిపిస్తోంది. చరణ్– ఎన్టీఆర్ లతో పాటు రాజమౌళి ఇదివరకూ ప్రమోషన్స్ ని మరో స్థాయికి తీసుకెళ్లారు. అయితే చివరి నిమిషంలో సినిమా వాయిదా పడింది. ఇప్పుడు పరిస్థితులు మళ్లీ మెల్లగా పుంజుకుంటున్నందున ఇక పై ప్రచారంలో నూతన పోకడలు చూడనున్నారు జనం. అలిగిన ఫ్యాన్స్ ని సంతుష్టులను చేసేందుకు రాజమౌళి టీమ్ అలెర్ట్ అవుతుందనే భావిద్దాం.

# పూజాహెగ్డే మనసులో వినూత్న కోరికలు!

ముంబై బ్యూటీ పూజాహెగ్డే కెరీర్ ఫుల్ స్వింగ్ లో ఉంది. టాలీవుడ్..కోలీవుడ్..బాలీవుడ్ అంటూ మూడు పరిశ్రమల్ని చుట్టేస్తుంది. నటిగా డే బై డై ఫైన్ అవుతూ కెరీర్ ని సక్సెస్ ఫుల్ గా ముందుకు తీసుకెళ్తోంది. ముఖ్యంగా తెలుగు సినిమాలు బుట్టబొమ్మ కెరీర్ కి పెద్ద టర్నింగ్ అని చెప్పొచ్చు. ఇక్కడ సక్సెస్ ఫుల్ గా రాణిచండంతోనే పరభాషల్లోనూ అవకాశాలకు పునాది పడింది. 'అల వైకుంఠపురములో'..'మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్ లర్ ' తో బ్యాక్ టూ బ్యాక్ సక్సెస్ లు ఖాతాలో వేసుకుంది.నిన్నటి రోజున బ్యూటీ నటించిన పాన్ ఇండియా చిత్రం 'రాధేశ్యామ్' కూడా రిలీజ్ అయింది. ఈ సినిమాకి డివైడ్ టాక్ వచ్చినప్పటికి నటనకు ఆస్కారం ఉన్న పాత్రలో నటించడం..పూజా యాక్టింగ్ స్కిల్స్ ప్రేక్షకుల్ని ఆకట్టుకున్నాయి. రొమాంటిక్ లవ్ స్టోరీ చిత్రంలో పూజా పాత్ర హైలైట్ అయింది. నటిగా పూజాహెగ్డే కెరీర్ కి ప్లస్ అనే చెప్పొచ్చు. సినిమా కమర్శియల్ గా సక్సెస్ అవుతుందా? లేదా ? అన్నది పక్కనబెడితే నటిగా పూజాహెగ్డే సెటిల్డ్ పెర్ఫార్మెన్స్ ఆకట్టుకుంది. 'రాధేశ్యామ్' ప్రచార కార్యక్రమాల్లో సైతం తన పాత్రకి వీలైనంత రీచ్ అయ్యేలా ప్రయత్నం చేసింది.తాజాగా బ్యూటీ లేడీ ఓరియేంటెడ్ చిత్రాలపైనా తన అభిరుచిని చాటింది. దక్షిణాది ఉమెన్ సెంట్రిక్ ఫిల్మ్ కి దేశ వ్యాప్తంగా మంచి గుర్తింపు ఉంది. బలమైన మహిళా ప్రాధాన్యమున్న పాత్రల్ని సృష్టించడంలో ఇక్కడి మేకర్స్ చాలా ప్రత్యేకతను కలిగి ఉన్నారు. నిర్మాతలు అలాంటి కథల్ని ఎంకరేజ్ చేయడంలో ముందుంటున్నారు. వాటిద్వారా హీరోయిన్లకు మంచి గుర్తింపు..పేరు ప్రఖ్యాతలు దక్కుతున్నాయి. ఒక అమ్మాయి గా 'సీత ఔర్ గీత'లో హేమమాలిని గుండాలను కొట్టడం చూసినప్పుడు – 'గాల్ గాడోట్ వండర్ వుమెన్' పాత్రల్లో అమ్మాయిలు కనిపించినప్పుడు... ఏంజెలీనా జోలి 'మిస్టర్ అండ్ మిసెస్' లో హార్డ్ కోర్ యాక్షన్ చూసినప్పుడు ఎంతో శక్తివంతమైన మహిళా పాత్రలని అనుభూతి కల్గుతుంది.అది నాకు ఎంతో ఎనర్జీని.ఉత్సాహాన్ని ఇస్తుంది. ఇంకా ఏదైనా పెద్దగా చేయాలని అలాంటి పాత్రలు ప్రేరణని కల్పిస్తాయి' అని తెలిపింది. ఏదో ఒకరోజు పూర్తి స్థాయి యాక్షన్ చిత్రం చేసి భవిష్యత్ తరానికి స్పూర్తిగా నిలవాలని ఆకాంక్షని వ్యక్తం చేసింది. అమ్మాయిలు బలంగా..మరింత ధృఢంగా ఉండే మరిన్ని సినిమాలు రావాలి. కానీ ఇప్పటివరకూ అలా జరగడం లేదు. నేను ఇలా మాట్లాడటం వెనుక కారణం మార్పు రావాలన్నదే ఆకాంక్షతోనే' అని తెలిపింది. తెలుగులో ఇటీవలి కాలంలో లేడీ ఓరియేంటెడె చిత్రాలకు పెద్ద పీఠ వేస్తోన్న సంగతి తెలిసిందే. సావిత్రి జీవిత కథ ఆధారంగా తెరకెక్కిన 'మహానటి' సినిమాతో తెలుగు సినిమాకు జాతీయ..అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు దక్కిన సంగతి తెలిసిందే. అంతర్జాతీయ ఫిలిం ఫెస్టివల్స్ లో 'మహానటి' పలు అవార్డులు..రివార్డులు సైతం దక్కించుకుంది. ఇతర భాషల సక్సెస్ ఫుల్ లేడీ ఓ రియేంటెడ్ చిత్రాల్ని టాలీవుడ్ మేకర్స్ ఇప్పుడిప్పుడే రీమేక్ చేస్తున్నారు. హాలీవుడ్ సినిమాల ప్రభావం తెలుగు సినిమాలపై పడుతుండటం విశేషం. సాంకేతికంగాను హాలీవుడ్ ని టెక్నాలజీని అందుకోవడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి.



# ఇంగ్లండ్‌కు మరో పరాభవం.. దక్షిణాఫ్రికా అద్భుత విజయం




మహిళల వన్డే ప్రపంచకప్ 2022లో డిఫెండింగ్ ఛాంపియన్ ఇంగ్లండ్‌కు మరో పరాభవం ఎదురైంది. మెగా టోర్నీలో వరుసగా మూడో మ్యాచ్‌లోనూ ఓటమిపాలై, క్వార్టర్స్ చేరుకునే అవకాశాలను సంక్లిష్టం చేసుకుంది. ఇప్పటికే ఆస్ట్రేలియా, వెస్టిండీస్ చేతిలో ఓడిన ఇంగ్లండ్, ఇవాళ (మార్చి 14) దక్షిణాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో 3 వికెట్ల తేడాతో పరాజయంపాలై మరోసారి భంగపడింది. ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి దక్షిణాఫ్రికా ఆహ్వానం మేరకు బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్..(62), వికెట్ కీపర్ జోన్స్ (53) అర్ధ శతకాలతో రాణించడంతో నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 235 పరుగులు చేసింది. సఫారీ బౌలర్ కాప్ (5/45) ఇంగ్లండ్ పతనాన్ని శాసించింది. అనంతరం 236 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన దక్షిణాఫ్రికా ఆదిలోనే ఓపెనర్ లిజెల్లె లీ (9) వికెట్ కోల్పోయినప్పటికీ.. లారా వొల్వార్డ్ (77), తజ్మిన్ బ్రిట్స్ (23), కెప్టెన్ సూన్ లుస్ (36), మరిజన్నె కాప్ (32)ల బాధ్యాతయుతమైన ఇన్నింగ్స్‌ల మరో నాలుగు బంతులు ఉండగానే విజయతీరాలకు చేరింది. జాగ్రత్తగా ఆడి జట్టును గెలిపించారు.ఆల్‌రౌండ్ పెర్ఫార్మెన్స్‌తో అదరగొట్టిన కాప్ ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు గెలుచుకుంది. ఇంగ్లండ్‌పై ఈ విజయంతో దక్షిణాఫ్రికా పాయింట్ల పట్టికలో రెండో స్థానానికి ఎగబాకింది. తొలి స్థానంలో ఆసీస్ ఉండగా టీమిండియా మూడో స్థానంలో, ఆతరువాత న్యూజిలాండ్, వెస్టిండీస్, బంగ్లాదేశ్ జట్లు వరుసగా నాలుగు, ఐదు, ఆరు స్థానాల్లో నిలిచాయి.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**